RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 28 ఫిబ్రవరి 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:228

# సీఎం ను కలిసిన లొంగిపోయిన మావోయిస్టు లు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు పార్టీ నాయకులు తిప్పిరి తిరుపతి (దేవ్ జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), పుల్లూరి ప్రసాద్ (చంద్రన్న), బడే చొక్కారావు (దామోదర్), పోతుల కల్పన (సుజాతక్క), నూనె నర్సింహారెడ్డి (గంగన్న) లు ఈరోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు. ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని గతేడాది పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి తో మావోయిస్టు నేతలు భేటీ అయిన సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు , వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు , రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి , అదనపు డీజీ (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్ , ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారు.

# లిక్కర్ కేసులో కేజ్రీవాల్, మనీష్ సిసోడియాకు ఊరట



ఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ కేసులో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాకు ఊరట లభించింది. మద్యం పాలసీ కేసు నుండి అరవింద్ కేజ్రీవాల్ను, మనీష్ సిసోడియాను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు డిశ్చార్జ్ చేసింది. ఎటువంటి ఆధారాలు లేకుండా వారిని ఇరికించారని, చార్జిషీటులో లోపాలు ఉన్నాయని న్యాయమూర్తి జస్టిస్ జితేందర్ సింగ్ మందలించారు. నిందితులపై అభియోగాలు మోపడం సరికాదని, వారిని కేసు నుండి డిశ్చార్జ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

# మున్సిపల్ ,పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎం సమీక్షా



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేసిన సీఎం శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలికోర్ అర్బన్ రీజియన్ లో ఉన్న అన్ని స్ట్రీట్ లైట్స్ కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలి. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలి అజఖీఇ పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి హోటల్స్ లోని కిచెన్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలి హోటల్స్ కు రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలి ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్ ఎక్విప్ మెంట్ వినియోగించాలి.నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్ లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలి ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలి.

# సీఎం చంద్రబాబును కలిసిన ఉప ముఖ్యమంత్రి భట్టి



తాడేపల్లి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసారు. అయనతో పాటు మంత్రి శ్రీధర్ బాబు కుడా వున్నారు. వచ్చే నెల 5న హైదరాబాద్లో జరగనున్న నా కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.

## ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుంది..

వార్తా 2 లో

# కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల అండ



విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ తమ ఒకరోజు పెన్షన్ విరాళంగా అందించింది. రూ.2.80 లక్షల చెక్కును మంత్రి జూపల్లి కృష్ణారావు డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.1 కోటి ఆర్థిక సాయం, ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించినట్టు మంత్రి గుర్తుచేశారు. మాదకద్రవ్యాలు, అక్రమ మద్యంపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.వారంలోగా సుమారు 2,500 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీలు పూర్తి చేస్తామని వెల్లడించారు.కుమ్మెర జాతర ఘటనపై విచారం వ్యక్తం చేసి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.పర్యాటక రంగ అభివృద్ధికి నూతన విధానంతో వాటర్ స్పోర్ట్స్, ఎకో, వెల్నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# జాతీయ కరాటే విజేతలకు టీపీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అభినందనలు




న్యూఢిల్లీ లోని లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులను టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు ఘనంగా సన్మానించారు. సీనియర్ -55 కేజీల కుమిటే విభాగంలో స్వర్ణ పతకం సాధించిన పి. బబ్బి వర్మను, అండర్-21 సంవత్సరాల -84 కేజీల కుమిటే విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్న కె. కౌశిక్ ప్రణయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ గారు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకువచ్చిన ఈ యువ క్రీడాకారులు రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, కఠిన సాధన, పట్టుదలతో ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే అవకాశం ఉందన్నారు. క్రీడలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందని, గ్రామీణ స్థాయిలో క్రీడా మౌలిక సదుపాయాలు పెంపొందించాలన్నారు.× క్రీడాకారుల కుటుంబ సభ్యులు, కోచ్‌లు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ యువత క్రీడా రంగంలో మరింతగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజాబలం

28 ఫిబ్రవరి 2026 శనివారం

# అమెరికాను మించి ఇజ్రాయెల్...

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్?ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది.దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది. ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు.ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బంధాన్ని బలోపేతం చేశాయి.ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్యసమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. రక్షణ, వ్యవసాయం, ఐఐ రంగాల్లో సహకారం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది.ఈ చరిత్రాత్మక సంఘటనలు రెండు దేశాల సంబంధాన్ని విశ్వాసంతో బలపరుస్తున్నాయి. భవిష్యత్తులో సైబర్ భద్రత, డ్రోన్ సాంకేతికతల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఆశిస్తున్నాయి. ఇది భారత్ మధ్యప్రాచ్య వ్యూహంలో కీలకమవుతుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి కలిశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ ? ఇజ్రాయెల్ మధ్య సంత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజేపీ, సంఘ్ పరివార్ మొదటి నుంచి ఇజ్రాయెల్ అనుకూలంగా ఉనానయి. ఇజ్రాయెల్ ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తుంది. అందుకే బీజేపీ, సంఘ్ ఇష్టపడతాయి.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్?ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు ? శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు. కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు.రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకాశాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో త్వరలో ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వానికి సమావేశం నిర్వహించే ప్రణాళికలను ఆయన ప్రకటించారు. మరిన్ని చర్చలకు ప్రముఖ మంత్రులను ఆహ్వానించే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఇరాన్‌పై అమెరికా దాడి సందర్భంలో ఇజ్రాయెల్ మద్దతు, గల్ఫ్ దేశాల ఒత్తిళ్లు భారత్‌ను కష్ట పరిస్థితిలో ఉంచవచ్చు.మోదీ పర్యటన భారత్ మధ్యప్రాచ్య వ్యూహాన్ని ప్రభావితం చేస్తుంది. ఇరాన్ వ్యతిరేక చర్యలకు మద్దతుగా కనిపించడం దీర్ఘకాలంలో దక్షిణ ఆసియా సంబంధాలను దెబ్బతీస్తుంది. రెండు దేశాల సహకారం లాభదాయకమైనా, భౌగోళిక రాజకీయాలు జాగ్రత్తలు పాటించాలి.

## ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి



విజయవాడ, ఫిబ్రవరి 27: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి కి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణలో మంత్రి కి ప్రత్యేక ప్రోటోకాల్ దర్శన ఏర్పాట్లు చేశారు. గర్భాలయంలోని అమ్మవారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు మంత్రి కి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రంగారావు మంత్రి కి అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. దర్శనం అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## మహిళలకు అండగా షీ టీం అరైవ్-అలైవ్ కార్యక్రమంలో ఏఎస్పీ రిత్విక్ సాయి






**ప్రజాబలం దినపత్రిక వేములవాడ ఫిబ్రవరి -27**వేములవాడ పట్టణంలోని అగ్రహారంలోని కే-కన్వెన్షన్ హాలులో జేఎన్టీయూ పాలిటెక్నిక్ డిగ్రీ విద్యార్థులకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ఆదేనుషారం. వేములవాడ ఏ ఎస్పీ రిత్విక్ సాయి అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన పై అవగాహన కల్పించారు. అలాగే ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలు ఆ కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వాహనం నడిపే సమయం లో హెల్మెట్, సీటు బెల్టు వినియోగం, అతివేగ నివారణ, మద్యం సేవించి వాహనం నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని సైబర్ నేరాల పట్ల సోషల్ మీడియాలో వచ్చే లింకులపై క్లిక్ చేయకూడదని వ్యక్తిగత సమాచారం ఎవరికి పంపవద్దని అనుమానాస్పద వ్యక్తులు మెసేజ్లు చేసిన ఫోన్లు చేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటితో కుటుంబానికి సమాజానికి హానికరమని, ముఖ్యంగా మహిళల రక్షణ కోసం షీ టీమ్ లు ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఎలాంటి వేధింపులకు గురైన నిర్భయంగా జిల్లా షీ టీం 87126 56425 నంబర్ కు ఫిర్యాదు చేయాలని ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాల ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్ ఐ సురేష్ ,ఎస్సై లు రామ్మోహన్ ,రాజు, షీ టీం ఏఎస్ఐ ప్రమీల సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ కమిషనర్ కలసిన రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ మందా మకరందు



హైదరాబాద్, 27 ఫిబ్రవరి 206:రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ గా నిన్న బాధ్యతలు స్వీకరించిన మందా మకరందు శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను హెడ్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన మందా మకరందు కు కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్ర నగర్ జోన్ లో ప్రగతిలో అభివృద్ధి కార్యక్రమాలు, సానిటేషన్, తదితర అంశాలను చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు, సానిటేషన్ కార్యకలాపాలు క్షేత్ర స్థాయిలో మరింత ప్రభావవంతంగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ కు కమిషనర్ దిశా నిర్దేశం చేశారు.

# ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుంది..

### ఉద్యోగులు ప్రజల కోసం నిలబడాలి ఉద్యోగ సంఘ నాయకులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





ఉద్యోగుల కోసం ప్రభుత్వం నిలబడుతుంది ఉద్యోగులు ప్రజల కోసం నిలబడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, కోటి రూపాయల ప్రమాద బీమా, సహజ మరణానికి 10 లక్షల బీమా, విద్యా విధాన పరిషత్తు ఉద్యోగులను 010 పద్దు కింద తీసుకురావడంలో దిశ నిర్దేశం చేసిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రజా భవన్ లో ఉద్యోగ సంఘ నాయకులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉద్యోగులు మొత్తాన్ని బాగా చూసుకోవాలి అనేది ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో చేపట్టే ప్రతి అంశం చివరి వ్యక్తి వరకు చేరే కార్యక్రమాన్ని ఉద్యోగులతో చేయించాలనేది మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఉద్యోగ వ్యవస్థ బలంగా ఉండాలి వారి కుటుంబాలు భరోసాతో ఉండాలని కోటి రూపాయల ప్రమాద బీమా, హెల్త్ స్కీం తీసుకొచ్చామని తెలిపారు.ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజలకు వ్యవస్థలు, సంస్థలు ఉపయోగపడాలనేది మా కోరిక అన్నారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1.02 కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాము, అదేవిధంగా రాజు ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నాము అన్నారు. ప్రతి పథకం ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళేందుకు 99 రోజుల కార్యక్రమాన్ని తీసుకువచ్చామని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సీరియస్ గా తీసుకొని యధాతథంగా కింది వరకు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులుశ్రీ మారం జగదీశ్వర్, శ్రీ ఏలూరి శ్రీనివాసరావు, శ్రీ దామోదర్ రెడ్డి, శ్రీ సదానంద్ గౌడ్, శ్రీ మధుసూదన్ రెడ్డి, శ్రీ బి. శ్యామ్, దాస్య నాయక్, వెంకట్ రెడ్డి, ఉమా దేవి, డాక్టర్ రామారావు, షౌకత్ హుస్సేన్, వెంకట్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ చైతన్యం ఏమైంది ..బరిగేసి కొట్లాడే సమాజం ఎందుకు నిర్వీర్యం అవుతుంది.చట్టం కూడా ఉన్నవాడి చుట్టంలా మారింది.. ఇది సమాజానికి మంచిది కాదు.

## పేదవాడికి న్యాయం మీద నమ్మకం పోయింది. రాబోయేకాలంలో.. బీసీలలో ఐక్యత పెరగాలి జాతిని కదిలించాలి. అదరినీ కలుపుకొని పోయి సమాజాన్ని నడిపించాలి. మాది మాకు కావాలని అడుగుతున్నాం తప్పు.. మీది మాకు కావాలని అడగడం లేదు మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్



హైదరాబాద్ ఫిబ్రవరి 27 తెలంగాణ చైతన్యం ఏమైంది ? ..బరిగేసి కొట్లాడే సమాజం ఎందుకు నిర్వీర్యం అవుతుంది.చట్టం కూడా ఉన్నవాడి చుట్టంలా మారింది..ఇది సమాజానికి మంచిది కాదు. పేదవాడికి న్యాయం మీద నమ్మకం పోయింది. రాబోయేకాలంలో.. బీసీలలో ఐక్యత పెరగాలి? జాతిని కదిలించాలి. అదరినీ కలుపుకొని పోయి సమాజాన్ని నడిపించాలి. మాది మాకు కావాలని అడుగుతున్నాం తప్పు.. మీది మాకు కావాలని అడగడం లేదు ? మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు.ఇందిరా పార్క్ వద్ద బిసి ల ధర్నాలో పాల్గొని ప్రసంగించారు.బీసీ ఉద్యమాలు, చేస్తున్న సామాజిక చైతన్యం ఒకణ్ణి గద్దె దింపి ఇంకొకణ్ణి ఎక్కించడానికి పనికి వస్తున్నాయి తప్ప మన ఆశయం నెరవేరడం లేదు. ఇంత జనాభా ఉన్న బీసీలు ఒకనికి దరఖాస్తు ఇచ్చుడు ఎందుకు ? బుచ్చగాళ్ల లెక్క అడుక్కోవడం ఎందుకు ? నీ రాజ్యం నువ్వు ఏలుకో అనే నినాదం వచ్చింది. ఎక్కడ ఉన్నా నా తపన ఈ వర్గాలకు మేలు జరగాలనే. కేంద్రంలో కూడా ఒక బీసీ మంత్రిత్వ శాఖ రావాలన్నారు.. చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలి. బీసీల ఉద్యమానికి నా పూర్తి సంఘీభావం. ఎన్నికల్లో డబ్బులున్నోడికే టికెట్ ఇస్తాం అనడం దురదృష్టం. బీసీల బడ్జెట్ లెక్కలు అన్నీ చిరంజీవి గారు చెప్పారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మన జీవితాలు మాత్రం మారడం లేదు. ర్పొరేషన్లు ఏర్పాటు చేస్తేనే సంబరపడ్డాం.. పూలువేశాం, పాలాభిశేకాలు చేశాం కానీ పాలు వేస్ట్ అయ్యాయి, పూలు వేస్ట్ అయ్యాయి. బడ్జెట్ కేటాయించగానే హారతులు పట్టాము.. కానీ కార్పొరేషన్లకు ఐదు పైసలు కూడా ఖర్చు చేయలేదు. నోరులేని కులాలకు ఖర్చు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు.. సంక్షేమం చేయకుండా మొండి చెయ్యి చూపించారు. మన ఉద్యమాలు, మనం చేస్తున్న సామాజిక చైతన్యం ఒకణ్ణి గద్దె దింపి ఇంకొకణ్ణి ఎక్కించడానికి పనికి వస్తున్నాయి తప్ప మన ఆశయం నెరవేరడం లేదు. అంతిమ లక్ష్యం చేరుకోవడం లేదు. ఇంత జనాభా ఉన్న బీసీలు ఒకనికి దరఖాస్తు ఇచ్చుడు ఎందుకు ? బుచ్చగాళ్ల లెక్క అడుక్కోవడం ఎందుకు ? నీ రాజ్యం నువ్వు ఏలుకో అనే నినాదం వచ్చింది. అందుకోసం ప్రయత్నం మొదలైంది. మనకు మద్దతుగా ఆయన రాకపాయే.. ఈయన రాకపాయే అని అనుకుంటున్నారు.. కింద పొగపెడితే అందరూ వస్తారన్నారు..శశభిషలు లేవు. లెఫ్ట్ ఉన్నా, రైట్ ఉన్నా కొట్లాట మాత్రం ఆగదు. న్యాయం ధర్మం ప్రజాస్వామ్యం మన వాటా కోసం బరిగీసి కొట్లాడే బిడ్డలకు నా సంపూర్ణ మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు.. రాజ్యం ఎవరి చేతిలో ఉంటే వాడికే ఊడిగం చేస్తుందని అంబేద్కర్ గారు చెప్పారు. వడ్డించేవాడు మనవాడు కాకపోతే ఎక్కడ కూర్చున్నా ఏమీ రాదు. ప్రభుత్వం ఉన్నది పేదలకోసం. సమస్త సంపద సమస్త ప్రజల అవసరాలు తీర్చాలనేది రాజ్యాంగ స్ఫూర్తి. కానీ అది అమలుకావడం లేదు. అంబేద్కర్ గారి కలలు నిజం కాలేదు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు.రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్న వారి మీదనే మన వ్యతిరేకత అన్నారు.. మన ఉద్యమంలో మాట్లాడే భాష, వ్యవహరిస్తున్న తీరువల్ల మనకు జరిగే ప్రయోజనం ఎంతో తెలియదు కానీ.. మనవల్ల వాళ్లు ఐక్యం అవుతున్నారు. సమాజాన్ని మెప్పించే పని జరగాలి తప్ప సమాజం నుండి వేరుపడేలా మన భాష ఉండకూడదు.ఈకాలంలో కూడా కుమ్మెరలో జరిగిన సంఘటన సభ్యసమాజాన్ని తలదించుకొనేలా చేస్తున్నాయి. ఇలాంటివి ప్రజాస్వామ్యానికే దురదృష్టకర మన్నారు.

# హడావిడి దర్యాప్తులు చేయడం, అరెస్టులకు దిగడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధం

## ప్రాథమిక నేరం నిరూపించకముందే పీఎంఎల్ఏ కింద అరెస్ట్ చేసి, దీర్ఘకాలం జైలులో ఉంచరాదు పీసీ చట్టం ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ ఫిబ్రవరి 27 : మనీలాండరింగ్ నిరోధక చట్టం అమలు జరుగుతున్న తీరుపై ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరైట్ హడావిడి దర్యాప్తులు చేయడం, అరెస్టులకు దిగడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమవుతుందని పేర్కొంది. ప్రాథమిక నేరం నిరూపించకముందే పీఎంఎల్ఏ కింద అరెస్ట్ చేసి, దీర్ఘకాలం జైలులో ఉంచరాదని ప్రత్యేక న్యాయమూర్తి (పీసీ చట్టం) జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.సీబీఐ అధికారిపై డిపార్ట్‌మెంట్ చర్యలుఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సిసోడియాతో సహా నిందితులందరికీ రౌస్ ఎవెన్యూ కోర్టు శుక్రవారం నాడు క్లీన్ చిట్ ఇచ్చింది. సీబీఐ ఛార్జిషీటులో మెరిట్ లేదంటూ కేసు నుంచి 23 మంది నిందితులకు విముక్తి కల్పించింది. ఢిల్లీ ఎక్సైజ్ కేసును ఇన్వెస్టిగేట్ చేసిన సీబీఐ అధికారిపై డిపార్ట్‌మెంట్ పరమైన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పీఎంఎల్ఏ కింద కేసులపై ప్రత్యేక న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రాథమిక నేరం లేకపోతే మనీలాండరింగ్ కేసు నిలువదంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని ప్రత్యేక న్యాయమూర్తి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముందస్తు నిర్బంధం శిక్షలా మారకూడదని అన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఇచ్చిందని, అది చట్టపరమైన సమతుల్యతతోనే పరిమితం చేయాలని అన్నారు. న్యాయం అనేది సులభమైన కథనాన్ని అనుసరించదని, సాక్ష్యాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటుదని స్పష్టం చేశారు.




# మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ నగేష్ కురువ




హైదరాబాద్ ఫిబ్రవరి 27 ;అరుణాచల ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను .కురుమ కురుబ కురువ సంక్షేమ సంఘము నేషనల్ అధ్యక్షులు డాక్టర్ నగేష్ కురువ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. కురువ లకు కురుబ కురుమ లకు జరుగుతున్న అన్యాయం ని ఆయనకి వివరించినట్లు నగేష్ కురువ తెలిపారు. కురుమల పిలువబడుతున్న 50 సంవత్సరాలు నిండిన వారికి ప్రతి ఒక్కరికి ఉబాయ తెలుగు రాష్ట్రాల్లో పింఛను 5000 మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

# కల్తీ పాలను ఇంట్లోనే గుర్తించండి.. ఇవిగో సింపుల్ చిట్కాలు..



హైదరాబాద్ ఫిబ్రవరి 27 ;తెల్లనివన్నీ పాలుకావని.. వాటిలో సైతం కల్తీ ఉంటుందనే విషయం ప్రజలకు క్లియర్ కట్‌గా అర్థం కావాలంటే పాలు నిజమైనవో.. కల్తీ జరిగిందనే దానిని గుర్తించేందుకు.. పలు సింపుల్ చిట్కాలున్నాయి.వాసన, రుచి..స్వచ్ఛమైన పాలు స్వల్ప తీపి వాసన కలిగి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే క్రీమ్ రుచిని కలిగి ఉంటాయి. అలా కాకుండా పాలు చేదుగా లేదా వింతైన రసాయన వాసర కలిగి ఉంటే.. అది కల్తీ పాలుగా గుర్తించవచ్చు.పాలలో పిండి లేదా.. ?కొద్దిగా పాలు తీసుకోవాలి. అందులో ఒకటి లేదా రెండు అయోడిన్ ద్రావణం చుక్కలు వేయాలి. ఆ వెంటనే పాలు నీలి రంగులోకి మారితే.. అందులో పిండి లేదా స్టార్చ్ కలిపారని గుర్తించాలి. అలా కాకుండా పాలు సాధారణ తెలుపు రంగులోనే ఉంటే.. కల్తీ జరగలేదని నిర్ధారణకు రావాల్సి ఉంటుంది.సర్ఫ్, సబ్బు, నూనెల కల్తీ..పాలను బాగా మరిగించినప్పుడు.. అవి పసుపు రంగులోకి మారితే.. అందులో సర్ఫ్, సబ్బు లేదా నూనె పదార్థాలు కలిపారని భావించాలి. అదే స్వచ్ఛమైన పాలు మరిగించినప్పుడు రంగు మారదు. అలాగే పాలను సీసాలో వేసి బాగా కుదిపితే.. అధికంగా నురగ వస్తే తప్పకుండా కల్తీ జరిగినట్లు నిర్ధారించుకోవాలి.గంజి పౌడర్ కలిస్తే..5 మిల్లీ లీటర్ల పాలలో 2 స్పూన్ల ఉప్పు కలపాలి. ఈ మిశ్రమం నీలి రంగులోకి మారితే.. పాలలో గంజి పౌడర్ కలిపినట్లు గుర్తించాలి.యూరియా కలిపితే..నీటిలో యూరియాను వినియోగించి కల్తీ పాలను సైతం తయారు చేస్తున్నారు. దానిని యూరియా స్ట్రిప్స్ ద్వారా గుర్తించాలి. ఈ స్ట్రిప్స్.. మందుల షాపుల్లో లభ్యమవుతాయి. అలా కాకుంటే.. పాలను వేడి చేసినప్పుడు ఆవిరిలో వచ్చే ఘన పదార్థాల వాసన ద్వారా సైతం గుర్తించవచ్చు.పాలలో నీటికి కలిపారంటే ఇలా..ఒక పలకను ఏటవాలుగా ఉంచాలి. దానిపై పాల చుక్కను జార విడవాలి. పాలు నెమ్మదిగా.. తెల్లని గీత లాగా కిందకు జారితే స్వచ్ఛమైనవని అర్థం. అలా కాకుండా చాలా వేగంగా జారితే మాత్రం పాలలో నీరు కలిపినట్లు గుర్తించాలి.వేడి చేస్తే సరిగ్గా మీగడ కట్టదు..స్వచ్ఛమైన పాలు కాచి.. చల్లార్చిన తర్వాత పైన మీగడ చిక్కగా అంటే మందంగా కడుతుంది. కానీ కల్తీ పాలు త్వరగా పాడవుతాయి. వేడి చేసినప్పుడు సరైన మీగడ కూడా రాదనే విషయాన్ని గమనించాలి..

# మార్చ్ 3 న చంద్ర గ్రహణం..పాటించవలసిన నియమాలు



హైదరాబాద్ ఫిబ్రవరి 27 ;చంద్ర గ్రహణం ఫాల్గున శుక్ల పూర్ణిమా మంగళవారము 03-03-2026 నాడు సింహరాశిలో పూర్వఫల్గునీ నక్షత్రమున కేతుగ్రస్త చంద్రగ్రహణం సంభవించును.స్పర్శ కాలం పగలు 03:20,సూర్యాస్తమయం (హైదరాబాద్) సాయంత్రం 06:23,మోక్ష కాలం రాత్రి 06:47,మొత్తం పుణ్యకాలం 00:24గ్రహణ ఆరంభము ప గం. 03:20 అయినను పుణ్యకాలము మాత్రం సూర్యాస్తమయము/ చంద్రోదయం నుండి ప్రారంభమగును.-: నిత్య భోజన ప్రత్యాబ్దికాది నిర్ణయము :-ఇత్యాది శాస్త్రవాక్యములను బట్టి సమర్థులు ఈరోజు పగలు ఏ రకమైన ఆహారాదులు తీసుకొనకూడదు. శుద్ధ మోక్షానన్తరము (రా 06:47 తరువాత) నిత్యభోజన, ప్రత్యాబ్దికములను ఈ రాత్రియే యథాప్రకారము జరుపుకొనవలెను. అశక్తులు (పిల్లలు, రోగగ్రస్థులు, గర్భిణులు, వృద్ధులు) ఈనాడు పగలు గం.11:00 లోపు భుజింప వచ్చును.ఈనాటి రాత్రికాలమున శ్రాద్ధాచరణము విశేష ధర్మ శాస్త్రమును బట్టి నిర్ణయము. అయితే విధవాకర్తృకశ్రాద్ధ మగుచో ఈ రోజు (పగలు రాత్రి) ఉపవసించి మరునాడే జరుపవలసియుండును. అట్లే ఈనాడు జరుపవలసిన విశేష పూజాదులన్నియు గ్రహణానంతరమే జరుప కొనవలయును.గ్రహణ గోచారము :- ఈ గ్రహణమును పూర్వఫల్గుని నక్షత్రము వారును, పూర్వాషాఢ నక్షత్రము వారును, భరణి నక్షత్రము వారును, అధమ ఫలము నిచ్చు రాశుల వారును అసలు చూడరాదు.శుభ ఫలము : మిథున, తుల, వృశ్చిక, మీన రాశులవారలకుమధ్యమఫలము : మేష, కర్కాటక, ధనుః, కుంభ రాశులవారలకుఅధమ ఫలము : వృషభ, సింహ, కన్య, మకర రాశులవారలకు.కొన్ని ముఖ్యమైన సూచనలు:సూర్యగ్రహణము సంభవించే ఝాము (యామము) నకు పూర్వపు నాలుగు ఝాములు (సుమారు 12 గంటలు) ముందుగా ఎటువంటి ఆహారము తినరాదు. చంద్రగ్రహణమునకు పూర్వపు మూడు ఝాములు (సుమారు 9 గంటలు) ముందుగా తినరాదు. 7 సం? వయస్సు లోపు పిల్లలకు, వృద్ధులకు ఈ నియమము లేదు. ఈవిధముగా పూర్తిగా నిరాహారముగా ఉండలేని వాళ్ళు పాలు, పండ్లు వంటి లఘువైన ఆహారమును స్వీకరించవచ్చును. గ్రహణము సంభవించు ఝామునకు ముందు ఝాములో (సుమారు 3 గంటలు) అది కూడా స్వీకరించుట ఉత్తమం కాదు.నీళ్ళు, పక్వముకాని పదార్థములు వీటి శుద్ధి కొరకు వాటిపై దర్భలు వేసియుంచుట అనాదిగా ఉన్న శిష్ట సంప్రదాయం. (కొన్ని ప్రాంతములో ఇంటి గర్భము (ప్రధాన హాలు) లో ముగ్గు వేసి దర్భలనుంచుట ద్వారా ఇంటి మొత్తమునకు శుద్ధి అగునను శిష్టాచారముగా కూడా గలదు). అలా ఉంచిన పదార్థాలను గ్రహణానంతరం వాడుకోవచ్చును. కాని గ్రహణ సమయానికి పూర్వమే వండిన పదార్థములు పనికిరావు.

# దిల్లీ మద్యం పాలసీ కేసులో సాంకేతిక అంశాల లోపాలపై కోర్టు నిర్ణయం ఈ కేసులో వాస్తవాలు లేకపోతే సెల్‌ఫోన్లు ఎందుకు తగలబెట్టారు? అంతమాత్రాన వారు అమాయకులని చెప్పలేం : బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు



హైదరాబాద్ ఫిబ్రవరి 27 ;దిల్లీ మద్యం పాలసీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు వెల్లడించిన తీర్పు విషయంలో.. కేజ్రీవాల్, కవితకు సంబంధించిన డిశ్చార్జ్ పిటిషన్ అనేది పూర్తిగా న్యాయపరమైన ప్రక్రియ మాత్రమే. ఇందులో సీబీఐ, అడ్వకేట్ల మధ్య తలెత్తిన సాంకేతిక అంశాల లోపాలపై కోర్టు నిర్ణయం తీసుకుంది. అంతమాత్రాన వారు అమాయకులని చెప్పలేం. ఇది కేవలం ట్రయల్ కోర్టులో జరిగిన ఒక నిర్ణయం మాత్రమే. తదుపరి చర్యలపై సీబీఐ నిర్ణయం తీసుకోవచ్చు.ఈ కేసులో వాస్తవాలు లేకపోతే సెల్‌ఫోన్లు ఎందుకు తగలబెట్టారు? కేజ్రీవాల్ పాలసీని ఎందుకు మార్చుకున్నారు? రివర్స్ పాలసీ ఎందుకు తీసుకువచ్చారు? ఢిల్లీ ఎక్సైజ్ పాలసీపై మొదట కంప్లైంట్ చేసింది కాంగ్రెస్ పార్టీనే - 2022లో. ఆ తర్వాతే 2024లో ఈడీ, సీబీఐ రంగంలోకి దిగాయి.ఈ కేసులో కేవలం సాంకేతిక లోపాల కారణంగానే డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు అనుమతించినట్లు తెలుస్తోంది.

# కల్లుగీత కార్మికుల భద్రత కాటమయ్య కిట్లు పంపిణీ చేసిన ఎంపీ చామల



జనగామ:కల్లుగీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు అందిస్తున్నామని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడన్నలకు వారి కుటుంబాలకు పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ పథకం ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరైన భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ. గౌడన్నలు ఉత్పత్తి చేసే కల్లు,నీరతోపాటు 80 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని, కేరళలో ఈ ఉత్పత్తులు పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారన్నారు.పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసే పరిశ్రమల్లో గౌడ సంఘాలు కూడా పాలుపంచుకోవాలని అన్నారు. తాటి చెట్లు ఎక్కేటప్పుడు కిట్లను తప్పనిసరిగా వాడాలని సూచించారు.కల్లు గీత కార్మికుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ఇక నుంచి కార్మికుడు చెట్టుపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రత్యేక కిట్లను తయారు చేసిందని, కాటమయ్య రక్షణ కవచం పేరిట 6 పరికరాలున్న కిట్ను సిద్ధం చేసిందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కులవృత్తులకు అన్ని విధాలా చేయూత అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ తెలిపారు. కల్లు గీత కార్మికుల ప్రాణాలకు ప్రజా ప్రభుత్వ అభయహస్తం కాటమయ్య రక్షణ కవచమని అన్నారు.

## ఫిలిం కార్పొరేషన్ పదవీ భర్తీ ఎప్పుడు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 27, రాజకీయ,సినీ రంగాలకు చాలా దగ్గర సంబంధాలు ఉంటాయి. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ స్పీకర్ పవన్ కళ్యాణ్ సినిమా రంగానికి చెందిన వారే. కూటమి గెలిస్తే ఏపీలో సినీ రంగం అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. దీనికి తోడు మొన్న ఎన్నికల్లో చిత్ర పరిశ్రమ అంతా కూటమి గెలవాలని కూడా భావించింది. అయితే గెలిచిన తర్వాత ఏపీ ప్రభుత్వం సినీరంగం విషయంలో సైలెంట్ గా ఉంది. అటు తెలుగు చిత్ర పరిశ్రమ సైతం ఏపీ కంటే తెలంగాణ ప్రభుత్వం విషయంలోనే ఆసక్తిగా ఉంది. ఏపీలో సైతం సినీ రంగానికి సంబంధించిన నియామకాలు కానీ.. ఎటువంటి చర్యలు కానీ లేవు. ముఖ్యంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇంతవరకు భర్తీ చేయలేదు.2019లో అధికారంలోకి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటనే ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని భర్తీ చేసింది. పోసాని కృష్ణమురళిని నియమించింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న ఆ పదవి భర్తీ చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ పదవిలో స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజును నియమించింది. ఏపీలో మాత్రం అదిగో ఇదిగో అంటూ రెండేళ్లు దాటిపోయింది. అయితే ఈ పదవి కోసం కూటమిలో చాలామంది ఆశావహులుగా ఉన్నారు. పైగా సినీ రంగానికి చెందిన పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా ఉండగా.. నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇంకోవైపు మెగా బ్రదర్ నాగబాబు ఎమ్మెల్సీగా ఉన్నారు. వీరంతా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి తమవారికి కట్ట పెట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి సినీ గ్లామర్ ఎక్కువ. ఆ పార్టీలో చాలామంది పనిచేశారు కూడా. ఒకప్పటి స్టార్ హీరోయిన్స్ జయప్రద, శారద లాంటివారు పనిచేశారు. ప్రస్తుతం రాఘవేంద్రరావు, అశ్విని దత్, మురళీమోహన్ లాంటి వారు ఉన్నారు. జనసేనలో సైతం సినీ గ్లామర్ ఉంది. బిజెపిలో దివంగత కృష్ణంరాజు కుటుంబ సభ్యులు ఉన్నారు. అయితే ప్రస్తుతం ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి విపరీతమైన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ ఏఎం రత్నం కు పదవి ఇవ్వాలన్న కోరికను బయటపెట్టారు. అది కూడా సీఎం చంద్రబాబు నిర్ణయించాల్సి ఉంటుందని షరతు పెట్టారు. వీలైనంత త్వరగా ఈ పదవిని భర్తీ చేయాలని సినీ పరిశ్రమ నుంచి వస్తోంది. మరి సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# వైసీపీ ఓటు బ్యాంక్ పరీక్ష

విజయవాడ, ఫిబ్రవరి 27, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు గతంలో ఎన్నడూ లేని విధంగా మతపరమైన అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. ముఖ్యంగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు హిందూ ఓటు బ్యాంక్ ఒక పెద్ద పరీక్షగా మారింది. గతంలో కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలే ప్రాతిపదికగా సాగిన రాజకీయం, ఇప్పుడు ఆచారాలు ? సెంటిమెంట్ల వైపు మళ్లింది.కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా తిరుమల నెయ్యి వివాదాన్ని తెరపైకి తెచ్చింది. ఇది కేవలం ఒక నాణ్యత లోపం సమస్యగా కాకుండా, కోట్లాది మంది హిందువుల విశ్వాసాలకు సంబంధించిన అంశంగా మారింది. జగన్ స్వతహాగా క్రిస్టియన్ కావడం వల్ల హిందూ దేవాలయాల పట్ల, ఆచారాల పట్ల ఆయనకు గౌరవం లేదని కూటమి బలంగా ప్రచారం చేస్తోంది. గతంలో తాడేపల్లి ఇంట్లో శ్రీవారి ఆలయ సెట్ వేయడం లాంటివి ఇందుకు దోహదం చేస్తున్నాయి. వైఎస్సార్ హయాంలో తిరుమల రెండు కొండల వివాదం, జగన్ హయాంలో రథాల దగ్ధం వంటి పాత సంఘటనలను ఇప్పుడు నెయ్యి వివాదంతో ముడిపెట్టి ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.తిరుమల పర్యటన సందర్భంగా అన్యమతస్థులు ఇచ్చే డిక్లరేషన్ అంశం జగన్‌ను ఇరకాటంలో పెట్టింది. నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలని కూటమి డిమాండ్ చేయగా, జగన్ తన పర్యటనను రద్దు చేసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇది హిందూ ఓటర్లలో ఒక రకమైన ప్రతికూల సంకేతాన్ని పంపిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీనిని కౌంటర్ చేయడానికే జగన్ ఇప్పుడు హిందూ సానుకూల ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు.తాజాగా పులివెందులలో నాగమల్లేశ్వర ఆలయ ప్రారంభోత్సవంలో జగన్ పాల్గొనడం వెనుక స్పష్టమైన రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. తాను హిందూ వ్యతిరేకిని కాదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని చాటిచెప్పడం జగన్ ఉద్దేశంగా కనిపిస్తోంది. అయితే, కూటమి నేతలు దీనిని కూడా వదలడం లేదు. ఓట్ల కోసమే ఈ భక్తి నాటకాలు అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.జగన్ ఈ రాజకీయ గండం నుంచి బయటపడాలంటే కేవలం ఆలయాల సందర్శన సరిపోదు. క్రిస్టియన్ నేపథ్యం ఉన్నప్పటికీ, హిందూ ఆచారాలను పాటిస్తున్నారనే నమ్మకాన్ని సామాన్య భక్తులలో కలిగించాలి. కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి, రాష్ట్రంలో కూటమితో కలిసి హిందూత్వ అజెండాను బలంగా పుష్ చేస్తోంది. దీనిని తట్టుకోవడం జగన్ కు కత్తిమీద సామే. వైఎస్సార్ కాంగ్రెస్ కు అండగా ఉండే దళిత, మైనారిటీ ఓటు బ్యాంకుకు తోడుగా ఉన్న హిందూ ఓట్లు చీలిపోతే, అది పార్టీ మనుగడకే ప్రమాదకరం.జగన్ మోహన్ రెడ్డికి ఇప్పుడు 'హిందూత్వ భయం' పట్టుకుందన్న వాదనలో కొంత నిజం ఉండొచ్చు. ఎందుకంటే, అభివృద్ధి లేదా సంక్షేమం గురించి మాట్లాడటం వేరు, సెంటిమెంట్ తో కూడిన మతపరమైన అంశాలను డీల్ చేయడం వేరు. జగన్ ఈ ఆరోపణల నుంచి బయటపడాలంటే, ఆయన తన సెక్యులర్ ఇమేజ్‌ను మరింత పకడ్బందీగా ప్రదర్శించాల్సి ఉంటుంది

# రాజీనామానే బ్రహ్మాస్త్రం

అమరావతి, ఫిబ్రవరి 27, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేయడంతో పాటు పదవులను వదులుకునేందుకు సిద్ధపడ్డారు. కానీ వారి రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో వారు న్యాయ పోరాటం చేయడం ప్రారంభించారు. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ కు ఏర్పడింది. అందుకే రాజీనామా చేసిన వారిని పిలిపించి వివరణ తీసుకుంటున్నారు మండలి చైర్మన్ మోసేన్ రాజు. నిన్ననే చైర్మన్ ను కలిసి వివరణ ఇచ్చారు జయ మంగళం వెంకటరమణ. ఈరోజు మిగతా ఎమ్మెల్సీలు సైతం చైర్మన్ ను కలిసి తమ వివరణ ఇచ్చారు. తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మండలి చైర్మన్ కు ఏర్పడింది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఏడుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యుల రాజీనామాకు ఆమోదం లభించడం.. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా పూర్తయింది. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. ఎందుకంటే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఈ ఐదుగురి రాజీనామాను ఆమోదిస్తే ఈ పదవులన్నీ కూటమి ఖాతాలో చేరుతాయి. మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ బలం కూడా పడిపోతుంది. దాదాపు ఏడాదిన్నరకు పైగా తొక్కి పెట్టారు రాజీనామాలను మండల చైర్మన్. కానీ ఇప్పుడు కోర్టు ఆదేశాలతో వారి వివరణ తీసుకుని ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ ది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 30 మంది వరకు ఎమ్మెల్సీల బలం ఉంది. కూటమికి శాసనమండలిలో పదిమంది మాత్రమే సభ్యులు ఉన్నారు. ఈ ఆరుగురు రాజీనామాను ఆమోదిస్తే కూటమి ఖాతాల్లో చేరనున్నాయి. 20 పైగా బలం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ రాజీనామాలు ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీతో పాటు పదవులకు రాజీనామా చేసే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకు అనర్హత వేటు పడుతుందన్న భయంతోనే ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అయితే ఆ ఆరుగురు రాజీనామాల విషయంలో ఆమోదం లభించిన మరుక్షణం.. చాలామంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2028 వరకు మోసేన్ రాజు పదవీకాలం ఉంది. అందుకే వీలైనంత త్వరగా శాసనమండలిని హస్త గతం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. కూటమి చైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం.. మరి కొంతమంది ఎమ్మెల్సీలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫ్యామిలీని రాజకీయాల్లోకి తీసుకురావొద్దు

విజయవాడ, ఫిబ్రవరి 27 సాధారణంగా రాజకీయ పార్టీల అధినేతలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత, వారి కుటుంబ సభ్యుల హడావుడి ఎక్కువగా ఉంటుందనే మాట వాస్తవం. పార్టీలో, ప్రభుత్వంలో వారి పెత్తనం నడుస్తూ ఉంటుంది. గతంలో ఎందరో రాజకీయ నాయకులు.. ఈ తరహాలో విమర్శలు ఎదుర్కొన్న వారే. తెలంగాణలో 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. కుటుంబ సభ్యుల జోక్యం విషయంలో విమర్శలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చిన విషయంలో, ప్రతిపక్షాలు అప్పట్లో తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాయి.ఇక 2023లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి విషయంలో కూడా ఇదే తరహాలో విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యుల్లో.. ఆయన సోదరుల పెత్తనం ప్రభుత్వంపై ఎక్కువగా ఉందంటూ ఆరోపణలు వచ్చాయి. ఇక పార్టీ నేతలు కూడా ఏదైనా కావాలంటే వారి వద్దకు వెళుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏపీలో జగన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా.. ఇదే తరహాలో ఆరోపణలు వచ్చాయి. వైఎస్ కుటుంబం ప్రభుత్వం పై పెత్తనం చేలాయిస్తుందని, కొంతమంది ఆరోపణలు చేశారు.దీనితో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ప్రభుత్వంలో కుటుంబ సభ్యుల జోక్యం విషయంలో కాస్త జాగ్రత్త పడుతున్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ.. అమరావతి రాకుండా పవన్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబుకు కూడా పవన్ కళ్యాణ్.. ఈ అంశానికి సంబంధించి ఓ క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం.

అనవసరంగా కుటుంబ సభ్యులను అమరావతి తీసుకురావద్దని, సచివాలయానికి గాని, జనసేన పార్టీ కార్యాలయానికి గాని, వారిని దూరంగా ఉంచాలని సూచించారట. అలాగే జనసేన మంత్రులకు కూడా పవన్ కళ్యాణ్ ఇదే తరహాలో స్పష్టమైన సూచనలు చేసినట్లు సమాచారం. అలాగే ఎమ్మెల్యే కార్యాలయాల్లో కూడా.. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు హడావుడి లేకుండా చూసుకోవాలని పవన్ స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది.

# ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం

రాజమండ్రి, ఫిబ్రవరి 27, ఏపీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు నేడే, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉ:ది. మిగిలిన భూములకు సంబంధించి త్వరలోనే సమావేశమై చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. త్వరలోనే ఈ ఫ్రీహోల్డ్ భూముల అంశంపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. భూముల సమస్యలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అమరావతిలోన సచివాలయంలో సమావేశమైంది.. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములు, 22ఏ, ఈనాం భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల అంశంపై సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13.59 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయగా.. వీటిలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలనే నిర్ణయానికి వచ్చారు. మిగిలిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయంతో.. లక్షలమంది రైతులకు ఊరట దక్కింది. ఈ భూముల రిజిస్ట్రేషన్లకు నిబంధనలకు అనుగుణంగా అనుమతించాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది.. పేదలకు ఇచ్చిన వ్యవసాయ భూముల్ని 20 ఏళ్లు దాటిన తర్వాత విక్రయించొచ్చని ఫ్రీహోల్డ్ ఆదేశాలు ఇచ్చింది. అయితే గత ప్రబుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని.. కొంతమంది తక్కువ ధరకు పేదల నుంచి భూముల్ని కొనుగోలు చేసి.. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ఫ్రీహోల్డ్‌గా మార్చుకునే ఆరోపణలు వచ్చాయి.నిబంధనలకు విరుద్ధంగా లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్‌గా మార్చినట్లు ప్రభుత్వానికి నివేదికలు చేరాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ భూముల అంశంపై విచారణ చేయించి.. భారీగా భూముల్ని ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించింది.ఏపీ ప్రభుత్వం 2025 ఆగస్టు 10న ఈ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆదేశాలను పొడిగించింది. తాజాగా కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు 7.85 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్‌కు అనుమతించారు. ఏపీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కలెక్టర్లు, రిజిస్ట్రార్లకు ఆదేశాలు రానున్నాయి. మొత్తానికి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతులకు ఊరట దక్కింది. మిగిలిన ఫ్రీహోల్డ్ భూములపై కూడా త్వరలోనే చర్చించి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

# జనసేన మెంబర్ షిప్ డ్రైవ్...

కాకినాడ, ఫిబ్రవరి 27, జనసేన .. జనం కోసమే పార్టీ అన్నది పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నినాదం. పార్టీ పెట్టి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు పవన్. ఎంత కూటమిలో ఉన్నప్పటికీ పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉందన్న సత్యాన్ని గుర్తించిన పవన్.. ఆదిశగా శరవేగంగా అడుగులేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసేనాని శ్రీకారం చుట్టారు.కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్రలోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు.

ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ. 400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది. కేవలం సభ్యత్వాలు తీసుకోవడమే కాకుండా, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ భారీ ఇన్సూరెన్స్ ప్యాకేజీని ప్రకటించింది. సభ్యత్వంతీసుకున్నవారికిరూ.5 లక్షలరూపాయల ప్రమాద బీమాతో పాటు, ప్రమాదవశాత్తు శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 2 లక్షల రూపాయలు, గాయపడితే రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. వసూలైన సభ్యత్వ రుసుమును పూర్తిగా పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగించడం ద్వారా కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తోంది.పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణను పెంచేందుకు సభ్యత్వాన్ని ఈసారి మూడు విభిన్న వర్గాలుగా విభజించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత అనే పేర్లతో కార్యకర్తల పనితీరు, నిబద్ధత ఆధారంగా ఈ వర్గీకరణ సాగనుంది. ఇప్పటికే గత రెండు విడతల్లో విజయవంతంగా 13 లక్షల మందికి పైగా సభ్యులను నమోదు చేసుకున్న జనసేన, ఈ మూడో విడత ద్వారా రికార్డు స్థాయి సంఖ్యను చేరుకోవాలని భావిస్తోంది. సిద్ధాంతాల ప్రచారం, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే ధ్యేయంగా సాగుతున్న ఈ సభ్యత్వ డ్రైవ్‌ను పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# అమరావతి రైల్వే లైన్ కు నిధులు

## 2047 కోట్లు.. 57కిమీ దూరం..!

విజయవాడ, ఫిబ్రవరి 27, రైల్వే డిపార్ట్మెంట్, ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న అమరావతి రైల్వే లైన్ కోసం తెలంగాణ రైతుల నుంచి భూసమీకరణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ -తెలంగాణ బోర్డర్‌లోని ఎర్రుపాలెం గ్రామం పరిధిలోని రైతులు అమరావతి రైల్వే లైన్ కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే దీనికోసం రైల్వే అధికారులు ఎర్రుపాలెం గ్రామస్తులతో పలు దఫాలు చర్చలు జరుపగా దాదాపు అందరూ ఒప్పుకొన్నట్టు అక్కడి స్థానికుడు, అడ్వకేట్ శ్రీనివాస్ తెలిపారు. నిజానికి ఈ ప్రాజెక్ట్‌లో సంక్లిష్టమైన భాగం ఈ భూ సేకరణ అని రైల్వే భావించింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నుంచి ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ సేకరికంచిన భూమి ఉంది. కానీ తెలంగాణలోని ఎర్రుపాలెంలో భూములు అమరావతి రైల్వే లైన్ కోసం ఇస్తారా అని అందరూ అనుమానించారు కానీ తెలంగాణ రైతులు మాత్రం దానికి దాదాపు అంగీకరించడంతో ఈ కొత్త రైల్వే లైన్‌కి అడుగు ముందుకు పడినట్టు అయింది.ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం గ్రామానికి శాతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడికి సమీపంలో ఉన్న జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైంది. ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయినప్పటికీ ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో పెద్దగా రైళ్లు ఆగవు. విజయవాడ -భద్రాచలం రోడ్డు మెము, విజయవాడ -డోర్నకల్ ప్యాసింజర్, గోల్కొండ ఎక్స్ ప్రెస్, కృష్ణా ఎక్స్ ప్రెస్ మాత్రమే ఇక్కడ రోజూ ఆగుతాయి. ఈ నాలుగు కాకుండా వారానికి రెండుసార్లు ప్రయాణించే చెన్నై -లక్నో ఎక్స్ ప్రెస్‌కి ఈ స్టేషన్‌లో హాల్ట్ ఉంది. చాలా రోజులుగా ఎర్రుపాలెం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పద్మావతి, శాతవాహన, విజయవాడ -సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్‌లను ఎర్రుపాలెం స్టేషన్‌లో ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అది ఒక డిమాండ్ గానే ఉండిపోతూ వచ్చింది. అమరావతి బైపాస్ రైల్వే లైన్ ఈ స్టేషన్ నుంచే ప్రారంభం అవుతుందని రైల్వే ప్రకటించడంతో ఎర్రుపాలెం వాసుల మైండ్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ లైన్ వల్ల ఎర్రుపాలెం స్టేషన్ హోదా మారి జంక్షన్ అవుతుంది. దానివల్ల అమరావతి వైపు వెళ్లే కొత్త రైళ్ళతోపాటు ఆల్రెడీ ఉన్న కొన్ని అదనపు రైళ్ళకు కూడా ఈ స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చి తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఊరు కూడా డెవలప్ అవుతోందని ఇక్కడి రైతులు భావిస్తున్నట్టు రెడ్డి అనే మరో గ్రామస్తుడు తెలిపారు. మొదట కాస్త ఇబ్బందిగా ఫీల్ అయినా మూడు నాలుగు దఫాల మీటింగ్స్ తర్వాత తమ భూములు కొత్త రైల్వే లైన్ కోసం ఇవ్వడానికి ఇక్కడి రైతులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూములు మార్కెట్ ధరలకు మూడు రెట్లు పరిహారం లభించనున్నట్టు కొందరు గ్రామస్తులు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ భూములను ఇవ్వడానికి వీరు ఒప్పుకొన్నారు.

ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూసేకరణ జరగాల్సి ఉన్నా అది పెద్దగా సంక్లిష్టం కాదు. ఆల్రెడీ అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూమి ఉంది. ఇది కాక మరికొన్ని గ్రామాల్లో భూసేకరణ జరగాల్సి ఉన్నా ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ ఆ పనిలో ఉంది. రైల్వే పరంగా కృష్ణా నదిపై నిర్మించాల్సి ఉన్న కొత్త బ్రిడ్జి ఒక్కటే పెద్ద పని. ఈ ప్రాజెక్ట్ కోసం 2047 కోట్ల బడ్జెట్ కేటాయించింది రైల్వే. దీనికి 2024లోనే అప్రూవల్ వచ్చేసింది. తెలంగాణాలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రుపాలెం నుంచి ఏపీ లోని గుంటూరు జిల్లాకు చెందిన నంబూరు వరకూ అమరావతి రైల్వే లైన్ నిర్మిస్తారు. ఈ రెండు స్టేషన్‌ల మధ్య కొత్తగా 10 స్టేషన్‌లు రానుండగా వాటిలో ఏపీ రాజధాని అమరావతి ఒకటి. 2029 జనవరి నాటికి ఈ రైల్వే లైన్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు జరుగుతున్నాయి. త్వరలోనే భూసేకరణ పూర్తి చేసి ఈ రైల్వే లైన్ నిర్మాణానికి శంఖు స్థాపన చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది.

# భూదాన్ ఆశయం..

# రియల్ ఎస్టేట్ మాఫియా మాయాజాలం!

ఖమ్మం, ఫిబ్రవరి 27, ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలకు కంచుకోట.. ఇప్పుడు అదే జిల్లా ఆక్రమణల కూల్చివేతలతో అట్టుడుకుతోంది. నగర శివారులోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో ఉన్న 'వినోబా నవోదయ కాలనీ'లో గురువారం రెవెన్యూ అధికారులు చేపట్టిన భారీ కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. సుమారు 650 ఇళ్లను జేసీబీలతో నేలమట్టం చేయడంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి.మూడు జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 1,000 మంది పోలీసుల పహారాలో, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సమక్షంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లోని సామాన్లు సర్దుకోవడానికి కూడా సమయం ఇవ్వలేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇళ్లు కూల్చవద్దని మహిళలు, వృద్ధులు జేసీబీల ముందు అడ్డంగా పడుకున్నా అధికారులు వెనక్కి తగ్గలేదు. కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే భూదాన్ ఉద్యమ స్ఫూర్తితో దాతలు ఇచ్చిన ఈ భూమి ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది.విలువ: కొత్త కలెక్టరేట్ సమీపంలో ఉండటంతో ఇక్కడి భూమి విలువ ఎకరాకు ?10 కోట్లు పలుకుతోంది. మొత్తం 30 ఎకరాలకు పైగా ఉన్న ఈ భూమి విలువ సుమారు ?300 కోట్లు ఉంటుందని అంచనా.ఇది భూదాన్ బోర్డుకు చెందిన ప్రభుత్వ భూమి అని, హైకోర్టు ఆదేశాల మేరకే ఆక్రమణలు తొలగిస్తున్నామని రెవెన్యూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దళారులు నకిలీ పత్రాలతో పేదలను నమ్మించి ఇక్కడ చేర్పించారని వారు చెబుతున్నారు.ఈ ఘటనపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో వీరికి నల్లా కనెక్షన్లు, విద్యుత్ మీటర్లు ఇచ్చారని, ఇప్పుడు రేవంత్ సర్కార్ ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని కేటీఆర్ విమర్శించారు. నేడు ఆయన బాధితులను పరామర్శించనున్నారు.

భూమాఫియా నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే తమ ఉద్దేశమని అధికార పార్టీ నేతలు అంటున్నారు. అయితే, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం చేస్తామని భరోసా ఇస్తున్నారు."ఓట్ల సమయంలో మా దగ్గరకు వచ్చి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు, ఇప్పుడు మంత్రులుగా ఉండి మమ్మల్ని ఎందుకు రోడ్డున పడేశారు?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షంలో శిథిలాల మధ్యే తమ సామాన్లతో తలదాచుకుంటున్న బాధితుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది.

ప్రభుత్వం కేవలం భూమి విలువను మాత్రమే కాకుండా, అక్కడ దశాబ్దాలుగా బతుకుతున్న పేదల జీవితాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పౌర సమాజం కోరుతోంది. రాజకీయ చదరంగంలో పేదవాడి సొంతింటి కల బలికావొద్దని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రేమ పెళ్లి చేసుకున్నాడని హత్య



మండపేట ద్వారపూడి గ్రామంలో నిన్న రాత్రి అత్యా సంఘటన చోటుచేసుకుంది. మృతుడు పోలిపల్లి సూర్యప్రకాశ్ (41). మృతుడు రాయవరం డిప్యూటీ తహసీల్దార్గా పనిచేస్తున్న సంధ్య తో స్నేహంగా వున్నాడు. వీరిద్దరూ గత రెండు సంవత్సరాలుగా పరస్పరం ప్రేమించుకొని గురువారమే అన్నవరం దేవస్థానంలో వివాహం చేసుకున్నట్లు సమాచారం.

ఈ వివాహంపై యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసారు. సుమారు రాత్రి 11:30 గంటల సమయంలో పెళ్లికొడుకు ఇంటికి వెళ్లి అతి కిరాతకంగా రాళ్లతో దాడి చేయడంతో పోలిపల్లి సూర్యప్రకాశ్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాచారం తెలిసిన వెంటనే మండపేట రూరల్ ఎస్సై వి. కిషోర్, సీఐ పి.దొర రాజు సిబ్బంది తో ఘటనా స్థలంని చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు మీడియాకు తెలిపారు ఈ దర్యాప్తులో ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్యా కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వేగం పెంచుతున్న అధికార పార్టీ

హైదరాబాద్ ఫిబ్రవరి 27, తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలనలో వేగం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తం కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ వ్యూహం ప్రకారం.. రాబోయే మూడు నెలల పాటు మంత్రులు, ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలోనే పర్యటించనున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల సందడి నెలకొనేలా చూడాలని సబ్ కమిటీ నిర్ణయించింది.

కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వంద రోజుల లోపు స్పష్టమైన మార్పు చూపడం ద్వారా ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధికారులకు సైతం స్పష్టమైన గడువులను నిర్దేశించి, పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించే బాధ్యతను ఈ నలుగురు మంత్రుల కమిటీకి అప్పగించారు.

# ఆశక్తిగా మారుతున్న చెన్నై రాజకీయాలు

చెన్నై, ఫిబ్రవరి 27, (న్యూస్ పల్స్) రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళనాడు రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది.. మొన్నటి వరకు అక్కడ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నది డీఎంకే, అన్నాడీఎంకే రెండు కూటములు మాత్రమే.. తాజాగా ఈ ఎన్నికల్లో నటుడు విజయ్ స్థాపించిన టివికే కూడా బరిలో ఉంది. ఇవి చాలదు అన్నట్లు ఇప్పుడు కొత్త పార్టీతో జయలలిత నెచ్చెలి శశికళ కూడా వస్తున్నారు. అంటే ఈ సారి తమిళనాడు ఎన్నికల పోరులో చతుర్ముఖ పోరు తప్పేలా లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఉన్నట్టుండి చిన్నమ్మ రాజకీయ పార్టీ ఏర్పాటు ఎవరి కోసం..? అదే ఇపుడు ఆ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత ఉన్నప్పుడు అన్ని తానే నడిపిన నాయకురాలు శశికళ అన్నది అందరికీ తెలిసిన విషయం. జయలలిత మరణం తర్వాత అక్రమాస్తుల కేసులో జైలుకెళ్లి విడుదలైన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటున్న శశికళ ఇప్పుడు సొంతంగా రాజకీయ పార్టీ ప్రకటన చేశారు. ఇప్పటికే శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ ఆధ్వర్యంలో ఓ పార్టీ ఉంది. మళ్లీ ఎప్పుడు శశికళ మరో పార్టీ పెట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్నదే ఇప్పుడు తమిళనాడులో చర్చనీయాంశంగా మారగా ఎందుకు అన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.తమిళనాడులో గతంలో రెండు కూటముల్లో ఉన్న పార్టీలు ఇప్పుడు అదే చోట లేదు. ఏ పార్టీ ఎప్పుడు ఏ కూటమిలో ఉంటుందో చెప్పలేని పరిస్థితి.. ఒకప్పుడు డీఎంకే తో ఉన్న పార్టీలు అన్నా డీఎంకే తో కలిస్తే తాజాగా అటు నుంచి ఇటు..ఇటు నుంచి అటు మారాయి.. ఇక అన్నా డీఎంకే లో చక్రం తిప్పిన నేతలు మాజీ ముఖ్యమంత్రి సైతం డీఎంకే గెలుపు కోరుతుండడం మరింత ఆసక్తిని రేపుతున్నాయి.ఆసక్తికరమైన రాజకీయాలకు కేరాఫ్ గా నిలిచే తమిళనాడులో ఇపుడు చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి.. తాజా పరిణామాలు అక్కడి రాజకీయాల్లో సంచలనంగా మారాయి. మొదటి నుంచీ డీఎంకే , అన్నాడీఎంకే అంటే ఉప్పు.. నిప్పు.. రెండు పార్టీల నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అయితే తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కీలక నేతల ఆలోచనా తీరులో మార్పు వస్తోంది. జయలలిత ఉన్నపుడు అన్నీ తానై నడిపిన శశికళకు కూడా ఇప్పుడు డీఎంకే గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి.ఒకప్పుడు డీఎంకేతో సుదీర్ఘ కాలం కలిసి నడిచిన పీఎంకే పార్టీ ఇప్పుడు అన్నాడీఎంకే బీజేపీ కూటమితో జతకట్టింది. పీఎంకే అంటే తమిళనాడులో బలమైన వన్నియర్ సామాజికవర్గ ఓటు బ్యాంకు కలిగిన పార్టీ.. ఇక నటుడు దివంగత విజయ్ కాంత్ కు చెందిన డీఎండీకే పార్టీ డీఎంకే తో చేతులు కలిపింది. గతంలో 2011 ఎన్నికల్లో జయలలితతో కలిసి పోటీ చేసి విజయం సాధించి అధికారం దక్కించుకున్న చరిత్ర విజయ్ కాంత్ పార్టీకి ఉంది. అలాంటిది ఇపుడు అనూహ్యంగా డీఎంకేతో జత కట్టింది డీఎండీకే. పీఎంకే, డీఎండీకే అటు ఇటు మారాయి.ఇక కీలకమైన మరో రెండు పరిణామాలు కూడా ఉన్నాయి.. అందులో ఒకటి మాజీ సీఎం జయలలిత నమ్మిన బంటు ఓ పన్నీర్ సెల్వం డీఎంకే కు మద్దతుగా నిలవడం. సీఎం స్టాలిన్‌తో మాజీ సీఎం ఓపీఎస్ భేటీ అయిన స్టాలిన్‌కు మద్దతు తెలిపారు. డీఎంకే ఐదేళ్ల పాలనను పొగిడిన ఓపీఎస్.. వచ్చే ఎన్నికల్లో డీఎంకే మళ్లీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. డీఎంకే పాలనపై ప్రజల్లో నమ్మకం ఉందని ఓపీఎస్ అన్నారు. తమిళనాడులో గంటగంటకు మారుతున్న రాజకీయ పరిణామాలతో ఎవరు ఎప్పుడు ఎవరితో కలుస్తారో గ్యారెంటీ లేని పరిస్థితి నెలకొంటోంది.కాగా అన్నాడీఎంకే టార్గెట్ గా పలు రాజకీయ పార్టీలు రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నాయి. ఒకప్పుడు తాను సారథ్యం ఆశించిన అన్నాడీఎంకే టార్గెట్ గా పార్టీ పెట్టేందుకు శశికళ ఏర్పాట్లు చేయడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అన్నాడీఎంకే పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకులో ప్రధానంగా దేవర్ సామాజిక వర్గం ఉంది. ఈ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత మాజీమంత్రి సెంగోట్టియన్ ఆ పార్టీని వీడి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీలో చేరారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీ సీఎం పన్నీర్ సెల్వం డీఎంకే కు మద్దతుగా నిలుస్తున్నారు. మరో వైపు అదే సమాజిక వర్గానికి చెందిన శశికళ కూడా కొత్తగా పార్టీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇవన్నీ అన్నాడీఎంకే ఓటు బ్యాంకు కు గండి కొట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అన్నాడీఎంకేను మ్యాగ్జిమ్ డ్యామేజ్ చేసి విజయ్ పార్టీకి సహకరించడమే శశికళ ఎత్తుగడ అన్న ప్రచారం కూడా జరుగుతోంది.జయలలిత జయంతి సభలో శశికళ పార్టీ ప్రకటన చేశారు. తమ పార్టీ జెండా అజెండా ఏంటన్నది వివరించారు.. పార్టీ పేరు మాత్రం త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు.. మొత్తానికి ఎన్నికల తేదీని ఈసీ ప్రకటించకముందే తమిళ రాజకీయాలు రంజుగా మారుతున్నాయి

# ఆర్టీసీ బస్సుల్లో తగ్గిన చార్జీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27, వేసవికాలంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో టికెట్ల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1వ తేదీ నుంచి తగ్గించిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే సమ్మర్ మొదలుకావడంతో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కబోత కూడా మొదలుకాబోతుంది. దీని వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేందుకు హైదరాబాద్‌లో తిరిగే ఏసీ బస్సుల్లో టికెట్ల రేట్లను తగ్గించారు. దీంతో ప్రజలపై భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో హాయిగా ఏసీ బస్సు ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు. ఏయే బస్సుల్లో ఎంత తగ్గించారు.. తగ్గించిన తర్వాత ఛార్జీలు ఎలా ఉన్నాయి అనే విషయాలు తెలుసుకుందాం.గతంలో మెట్రో డీలక్స్ ఏసీ బస్సుల్లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు టికెట్ ఛార్జీ రూ.30గా ఉండేది. కానీ ఇప్పుడు రూ.25కి తగ్గింది. దీంతో ప్రతీ నాలుగు కిలోమీటర్ల ప్రయాణంపై రూ.5 మేర తగ్గింపు మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని టీజీఎస్ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో గతంలో నాలుగు కిలోమీటర్లకు రూ.35 చొప్పున ఉండగా.. ఇప్పుడు రూ.25కి తగ్గనుంది. ఏకంగా రూ.10 మేర తగ్గనుండటం ప్రయాణికులకు ఊరటగా చెప్పవచ్చు. ఎండాకాలంతో పాటు ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ నిండుగా ఉండటం లేదు. ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ ఉంటుంది. ధరలు ఎక్కువగా ఉంటాయనే కారణంతో కొంతమంది వెనకడుగు వేస్తున్నారు. ఛార్జీలను తగ్గిండచడం వల్ల ఆక్యుపెన్సీ పెరగడంతో పాటు సమ్మర్‌లో ప్రయాణికులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది.1 నుంచి 3 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలర్స్ బస్సుల్లో 0 నుంచి రూ.10 వరకు ఆదా కానుండగా.. ఈ-మెట్రో బస్సుల్లో 5 నుంచి రూ.10 తగ్గుతుంది. ఇక 4-15 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.5 నుంచి రూ.10, ఈ-మెట్రో బస్సుల్లో రూ.10 నుంచి రూ.15 ఆదా అవుతుంది. ఇక 16 నుంచి 21 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.10 నుంచి రూ.15, ఈ-మెట్రో బస్సులలో రూ.10 నుంచి రూ.15, 22-30 కిలోమీటర్ల ప్రయాణానికి మెట్రో డీలక్స్,ఈ మెట్రో ఏసీ బస్సుల్లో రూ.5 నుంచి రూ.10 వరకు ఆదా అవుతుంది. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 275 మెట్రో డీలక్స్, 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఛార్జీల తగ్గింపుతో నగర ప్రజలకు లబ్ది చేకూరనుంది.

# మావోయిస్టుల కండిషన్స్...

హైదరాబాద్, ఫిబ్రవరి 27, దేశంలో మావోయిస్టు పార్టీ తుది దశకు చేరుకుంది. అగ్ర నాయకులు ఒకరి తర్వాత ఒకరు.. లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. 1967లో పశ్చిమ బెంగాల్ లోని, నక్సల్ బరీలో పుట్టిన మావోయిస్టు ఉద్యమం.. ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు లొంగిపోవడం లేదా చచ్చిపోవడమో అన్నట్లుగానే, గత రెండు.. మూడు ఏళ్ల నుంచి కాలం గడుపుతూ వస్తున్నారు.ఇక తెలంగాణ ప్రభుత్వం మావోయిస్టులకు అండగా నిలబడటంతో.. పెద్ద ఎత్తున కీలక మావోయిస్టు నాయకులందరూ తెలంగాణ వచ్చి లొంగిపోయే ప్రయత్నం చేస్తున్నారు. నిన్న దేవ్ జి బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డి, మల్లా రాజిరెడ్డి వంటి వారు తెలంగాణ డిజిపి ఎదట లొంగిపోయారు. దీనితో ఇప్పుడు మావోయిస్టు పార్టీ కీలక నేత గణపతి ఎక్కడున్నారు అనే దానిపైనే చర్చ జరుగుతోంది. గణపతి ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో నేపాల్ లో ఉన్నట్లుగా భావిస్తున్నారు.2018 లో పార్టీ బాధ్యతలను నంబాలకు అప్పగించిన తర్వాత ఆయన.. ఒడిస్సా మీదుగా బీహార్ చేరుకుని అక్కడి నుంచి నేపాల్ వెళ్ళినట్లు భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన తెలంగాణ పోలీసులతో చర్చలు కూడా జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తనను కేంద్ర బలగాలకు అప్పగించోద్దని.. ఆయన షరతు విధించినట్లు సమాచారం. దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమాన్ని ముందుండి నడిపించారు గణపతి. ప్రస్తుతం అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్న ఆయన, బీహార్ మీదగా నేపాల్ వెళ్లిపోయినట్లు సమాచారఆయన కూడా లొంగిపోతే దేశంలో మావోయిస్టు పార్టీ పూర్తిగా అంతిమ దశకు చేరుకున్నట్లే. తెలంగాణకు చెందిన మరి కొంతమంది నేతలు ప్రస్తుతం.. ఝార్ఖండ్ ప్రాంతంలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. గణపతి కోసం అటు కేంద్ర బలగాలు కూడా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక మావోయిస్ట్ లలో మరో కీలక నేత నరహరి ఎక్కడ ఉన్నారు అనే దానిపై బలగాలు పెద్ద ఎత్తున గాలిస్తున్నాయి

# హైదరాబాద్ నగరంలో పాడ్ ట్యాక్సీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27, హైదరాబాద్ నగరవాసులకు తీపి కబురు. నగరంలో మరో హైటెక్ రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు, మెట్రోలు, ఆటోలు, ర్యాపిడో వంటి బైక్‌ల ద్వారా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. త్వరలోనే విదేశాల్లో మాదిరిగా పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో స్టేషన్లను కనెక్ట్ చేస్తూ ఈ ట్యాక్సీలు నడపనున్నారు.హైదరాబాద్ నగరవాసులకు గుడ్‌న్యూస్. త్వరలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో ట్రైన్లను కనెక్ట్ చేస్తూ.. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) పేరిట ప్రభుత్వం ఈ ట్యాక్సీలు తీసుకురానుంది. మెట్రోరైలు స్టేషన్ల నుంచి ప్రయాణికులు తొందరగా తమ గమ్యస్థానం చేరేందుకు ఈ పాడ్ ట్యాక్సీలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోనే చేపట్టాలనేది ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) విధానంలో సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక చేయనున్నారు. అందు కోసం హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేసింది.ప్రస్తుతం నగరంలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. నగరం ఓ మూల నుంచి మరో మూలకు త్వరగా చేరుకునేందుకు మెట్రో బెస్ట్ ఆప్షన్ అయింది. అయితే మెట్రో దిగిన తర్వాత తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఇవి అన్ని చోట్ల అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. దానికి తోడు ట్రాఫిక్‌లో నరకం. ఈ ఇబ్బందులను తొలగించేందుకు.. మెట్రో స్టేషన్ల నుంచి రోడ్ల మీదకు రావాల్సిన అవసరం లేకుండా నేరుగా పాడ్‌ట్యాక్సీల ద్వారా గమ్యస్థానాలను చేరుకునేలా వినూత్న రవాణా వ్యవస్థ ప్రవేశపెట్టేందుకు సర్కార్ రెడీ అయింది.ముందుగా.. రాయదుర్గం-కూకట్‌పల్లి, రాయదుర్గం-హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెట్రో స్టేషన్లు, నాలెడ్జి సిటీ, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పాడ్ ట్యాక్సీలు పూర్తిగా ఆటోమేటెడ్, డ్రైవర్ లేకుండా నడుస్తాయి. ఎలివేటెడ్ ట్రాక్‌లపై నడిచే ఈ ట్యాక్సీలు..గంటకు గరిష్ఠంగా 40 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రతి పాడ్ ట్యాక్సీలో 6 నుంచి 8 మంది ప్రయాణించవచ్చు. గంటకు 10వేల మందిని చేరవేసే సామర్థ్యం ఉంటుంది. బ్యాటరీ లేదా విద్యుత్తు వినియోగంతో ఎలాంటి కాలుష్యం సమస్య తలెత్తదు. మెట్రో స్టేషన్‌లో దిగడానికి కంటే ముందు పాడ్‌ట్యాక్సీని బుక్ చేసుకోవడం ద్వారా సమయా ఆదా అవుతుంది. ఇలాంటి రవాణా వ్యవస్థ ప్రస్తుతం ముంబైలో పట్టాలెక్కుతుండగా.. త్వరలోనే హైదరాబాద్ నగరంలోనూ అందుబాటులోకి రానుంది.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం వినియోగం పోలీసుల దాడి

పెనమలూరు ఉయ్యూరు టౌన్ సి ఐ రామారావు ఆధ్వర్యంలో అర్ధరాత్రి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను ఉయ్యూరు టౌన్ ఎస్ఐ లోకేశ్వరి, మల్లికాసులు, సిబ్బంది, అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు , డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్న వ్యక్తులకు ఉయ్యూరు టౌన్ పోలీసులు చెక్ పెట్టారు. స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

# రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

నాయుడుపేట పండ్లూరు రైల్వే లైన్ పై హుస్సేన్ తల లేని డెడ్ బాడీ కలకలం రేపింది. మృతుడు ముస్లిం వీధికి చెందిన ఉస్మాన్ అనే యువడితో ఓ హిజ్రాతో సంబంధాలు వున్నాయి. ఉస్మాన్ సోదరుడు హుస్సేన్ హిజ్రా వద్ద కొంత బంగారాన్ని తీసుకుని కొదవ పెట్టి వాడుకున్న వైనం. హిజ్రా మరి కొంత మందితో కలిసి ఆటోలో వచ్చి హుస్సేన్ ను కిడ్నాప్ చేసినట్టు సమాచారం. పండ్లూరు రైల్వే ట్రాక్ పై తలలేని హుస్సేన్ డెడ్ బాడీ దొరకడంతో స్థానికులలో కలవరపాటు రేపింది. విషయం తెలుసుకున్న నాయుడుపేట పోలీసులు ఘటనపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

# గాంధీ సరోవర్ ప్రాజెక్ట్.. అభివృద్ధి మంత్రామా? పర్యావరణ విధ్వంసమా?

హైదరాబాద్, ఫిబ్రవరి 27, హైదరాబాద్ లైఫ్ లైన్ అయిన మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావాలనే పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వం 'గాంధీ సరోవర్' అనే ప్రతిష్టాత్మక రిజర్వాయర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బండ్లగూడ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా అటు వరదల ఉధృతిని అరికట్టడంతో పాటు, ఇటు నగరం నడిబొడ్డున పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అధికారులు భావిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా రాబోయే ఈ మార్పు నగర ముఖచిత్రాన్నే మారుస్తుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. అయితే, మ్యాప్‌లో గీసిన ఈ ప్లాన్ క్షేత్రస్థాయిలో ఉన్న వేలాది కుటుంబాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ముఖ్యంగా మధుపార్క్ వంటి కాలనీలు ఈ ప్రాజెక్టు వల్ల పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు.అభివృద్ధి అనే పదానికి అర్థం తమ ఇళ్లను కూల్చడమేనా అని మధుపార్క్ నివాసితులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దశాబ్దాల కాలంగా రూపాయి రూపాయి పోగేసి, ఎన్నో కలలతో కట్టుకున్న తమ గూడు ఒక్క రాత్రిలో అక్రమ కట్టడంగా మారిపోవడం వారిని కలిచివేస్తోంది. మార్కింగ్‌ల పేరుతో అధికారులు తిరుగుతుంటే, రేపు తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనతో ఆ ప్రాంత వాసులకు కంటిమీద కునుకు కరువైంది. కేవలం ఒక ప్రాజెక్టు కోసం తరతరాలుగా ఉంటున్న మనుషులను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుండి ఎలాంటి స్పష్టమైన భరోసా లభించకపోవడం ఈ కాలనీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడటానికి ప్రధాన కారణమైంది.ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం చట్టపరమైన పత్రాలు. స్థానికుల వద్ద అన్ని అనుమతులతో కూడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని బఫర్ జోన్ లేదా ఎఫ్.టి.ఎల్ పరిధిలోకి వస్తుందని ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. ఇన్నాళ్లూ మున్సిపల్ పన్నులు వసూలు చేసి, కరెంటు కనెక్షన్లు ఇచ్చి, రిజిస్ట్రేషన్లు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు అకస్మాత్తుగా అవన్నీ నిబంధనలకు విరుద్ధమని చెప్పడం విడ్డూరంగా ఉందని బాధితులు వాపోతున్నారు. చట్టబద్ధంగా కొనుక్కున్న ఆస్తులకు రక్షణ లేకపోతే సామాన్య మధ్యతరగతి మనిషి ఎవరిని నమ్మాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ డాక్యుమెంట్ల పంచాయితీ ఇప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పెద్ద యుద్ధంగా మారింది.మరో కోణంలో చూస్తే, ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నగర భవిష్యత్తు కోసం అనివార్యమైనదిగా చూస్తోంది. మూసీ నదికి వచ్చే భారీ వరదలను నియంత్రించకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌కు ముప్పు తప్పదని, అందుకే గాంధీ సరోవర్ వంటి రిజర్వాయర్లు అవసరమని అధికారులు వాదిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ద్వారా నగరానికి కొత్త కళ వస్తుందని, పర్యావరణ పరంగా కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని వారి వాదన. బాధితులకు తగిన పరిహారం అందిస్తామని లేదా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇస్తున్నప్పటికీ, తమ సొంత ఇళ్లను వదిలి ఇరుకు గదుల్లోకి వెళ్లడానికి ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరు.ప్రస్తుతం బండ్లగూడలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఒకవైపు సర్వేలు నిర్వహిస్తున్న అధికారులు, మరోవైపు తమ ఇళ్లను కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ప్రజలతో ఆ ప్రాంతం నిరంతరం యుద్ధభూమిని తలపిస్తోంది. అభివృద్ధి పేరుతో సామాన్యుల హక్కులను కాలరాయవద్దని పౌర సమాజం నుండి కూడా మద్దతు లభిస్తోంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మొండిగా ముందుకు తీసుకెళ్తుందా లేక ప్రజల విజ్ఞప్తులను మన్నించి తన ప్రణాళికను సవరిస్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, అభివృద్ధి కింద నలిగిపోతున్న సామాన్యుడి ఆవేదన మాత్రం హైదరాబాద్‌లో పెద్ద చర్చకు దారితీసింది.

**అప్పుడు 12... ఇప్పుడు 50**

హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా భావిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూసీ తీర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇక్కడ ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కిస్మత్‌పురా, దర్గా డివిజన్ల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో స్థానికంగా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్, ఉప్పర్‌పల్లి పరిధిలోని పలు కీలక నిర్మాణాలను అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. ముఖ్యంగా మధు పార్క్ రిడ్జ్ వంటి ప్రముఖ అపార్ట్‌మెంట్లు కూడా 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలోకి వస్తుండటంతో వాటి భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఈ ప్రాంతంలో బఫర్ జోన్ నిబంధనలు వేరుగా ఉన్నప్పటికీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీనివల్ల గతంలో అనుమతులు పొంది నిర్మించిన భవనాలు కూడా ఇప్పుడు ప్రభుత్వ సేకరణ పరిధిలోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది.చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 2004 సంవత్సరంలో మూసీ బఫర్ జోన్ కేవలం 12 మీటర్లుగా మాత్రమే ఉండేది. అయితే నది పరిరక్షణ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 2012లో ఈ పరిమితిని 50 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మధు పార్క్ రిడ్జ్ వంటి భారీ నివాస సముదాయాలు ఇప్పుడు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చాయి. అప్పట్లో నిబంధనల ప్రకారమే అనుమతులు పొందినప్పటికీ, ప్రస్తుత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్మాణాలను సేకరించడం అనివార్యమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇస్తూ, ప్రభుత్వం ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తుందని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం అపార్ట్‌మెంట్ వాసులకు పరిహారం చెల్లించి, ఆ తర్వాతే ఆయా నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కేవలం బలవంతంగా ఖాళీ చేయించడం కాకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తామని స్పష్టం చేశారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ, బాధితుల నుంచి వచ్చే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు ప్రభుత్వం తరపున అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం మొత్తం 83 ఎకరాల 13 గుంటల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భారీ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు భూములు, నివాస ప్రాంతాలను గుర్తించి, వాటి యజమానులతో సంప్రదింపులు జరిపేందుకు యంత్రాంగం సిద్ధమైంది. కేవలం అపార్ట్‌మెంట్లు మాత్రమే కాకుండా, నది పరివాహక ప్రాంతంలోని అన్ని రకాల ఆక్రమణలు, బఫర్ జోన్ ఉల్లంఘనలపై అధికారులు నిశితంగా దృష్టి సారించారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం దశల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. ఉన్నఫళంగా ఇళ్లను ఖాళీ చేయించబోమని, ప్రతి అడుగులోనూ బాధితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి 60 రోజుల పాటు స్థానికుల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరిస్తారు. ఈ సమయంలో వచ్చే ప్రతిపాదనలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని ఆర్డీవో వెంకట్ రెడ్డి విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం మూసీ నదికి పాత వైభవాన్ని తీసుకురావడమే కాకుండా, నగరవాసులకు ఒక చక్కని పర్యాటక ప్రాంతాన్ని అందుబాటులోకి తీసుకురావడం. గాంధీ సరోవర్ పేరుతో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇన్నాళ్లూ అక్కడ నివాసం ఉంటున్న సామాన్యులకు పరిహారం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు

## భార్య ఆరోగ్యం కోసం బిచ్చగాడు సినిమా తరహాలో...

కరీంనగర్, ఫిబ్రవరి 27, బిచ్చగాడు సినిమాలో హీరో విజయ్ ఆంటోని తల్లి అనారోగ్యం తగ్గాలంటూ 48 రోజులు బిచ్చగాడి దీక్ష తీసుకుంటాడు.ఇది సినిమా కథ.. ఇది కూడా ఆధ్యాత్మిక సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందినదే. అయితే ఇలాంటి దీక్షలు చేస్తే ఉద్దేశం నెరవేరుతుందా? నిజంగా అనుకున్నది జరుగుతుందా? కర్మ సిద్ధాంతం ప్రకారం..మునుపటి కర్మల నుంచి విముక్తి పొందేందుకు ఇలాంటి దీక్షలు చేపడితే పాప కర్మలు తగ్గిస్తాయని నమ్మకం. భగవద్గీత అధ్యాయం 18, శ్లోకం 5 ప్రకారం యజ్ఞం, దానం, తపస్సు వంటివి పాపాలను నాశనం చేస్తాయని ఉంది. ఆలయాలను శుభ్రం చేయడం నిష్కామ కర్మ ఇది మనసుని శుద్ధి చేస్తుంది. ఇలాంటి దీక్షలు భక్తిని పెంచి మనసుని శాంతపరుస్తాయి. ఆయుర్వేదం, యోగ శాస్త్రాల్లో కూడా మనసు-శరీరం సంబంధం గురించి ఉంటుంది. బిచ్చగాడిలా దీక్ష అంటే సన్యాస దీక్షలు సమానం...ఇది అహంకారాన్ని తగ్గించి దైవిక శక్తిని ఆకర్షిస్తుంది. తద్వారా అనుకున్నది నెరవేరుతుందని ఆధ్యాత్మివేత్తల మాట. ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఓ అడ్వకేట్ తన భార్య ఆరోగ్యం కోసం బిచ్చగాడిగా మారారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఆయన పేరు కాసర్ల జలంధర్ రెడ్డి ,అడ్వకేట్ ..సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాస్ నగర్ కు చెందిన ఆమె పేరు శిరీష, బీకాం కంప్యూటర్స్..ఆయన కరీంనగర్లో ప్రాక్టీస్ చేస్తే, ఆమె ప్రైవేట్ ఉద్యోగం చేసేది. 2006లో పెళ్లి జరిగింది, పిల్లలు లేరు. అనారోగ్యం పాలైన ఆమె వైద్యం కోసం ఎంతో ఖర్చు చేశారు, ఎన్నో హాస్పిటల్స్ తిరిగారు.. అయితే వేములవాడ రాజన్న సన్నిధిలో భిచ్చమెత్తుకుంటే ఆరోగ్యం కుదుటపడుతుందని చెప్పడంతో మూడు నెలలుగా భిక్షాటన చేస్తున్నారు ఆ దంపతులు. పెళ్లితో ముడిపడిన బంధాన్ని వీడలేక, భార్య ఆరోగ్యంగా ఉంటే చాలు అని భావించి, ఆ భగవంతుడిపైనే భారం వేసి దైవసన్నిధిలో బిచ్చమెత్తుకుంటున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశాల మేరకు వేములవాడలో బిచ్చగాళ్లకు కౌన్సిలింగ్ సెషన్స్ నిర్వహించారు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఏఎస్పీ చంద్రయ్య. ఈ సమయంలో అనర్గళంగా ఇంగ్లీష్ లో మాట్లాడుతున్న ఆ జంటను చూసి వివరాలు అడిగితెలుసుకున్నారు అధికారులు. తనకు పెద్దగా ఆస్తులు లేవని, అద్దె ఇంట్లో ఉంటూ అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేసేవాడిని అని, తన భార్య ఆరోగ్యం కుదటపడాలని ఆస్పత్రుల చుట్టూ తిరిగి విసిగిపోయాను..అందుకే దేవుడే దిక్కని భావించి ఇలా భిక్షాటన చేస్తున్నాం అని చెప్పారు జలంధర్ రెడ్డి. తనకు పోలియో ఉన్నా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు జలంధర్ రెడ్డి భార్య శిరీష. ప్రభుత్వం పెన్షన్ ఇస్తే కొంతైనా సాయం చేసినట్టు అవుతుందని చెబుతోంది ఆమె.కారణాలు ఏమైనా కానీ.. జలంధర్ రెడ్డి, శిరీష తీసుకున్న నిర్ణయంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తిరుమల లాంటి క్షేత్రంలో భగవంతుడి సేవ చేస్తే ఆరోగ్యం, మనశ్శాంతి లభిస్తుందని చాలామంది నమ్మకం. దీక్షలు తీసుకుంటే అనారోగ్య సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని మరికొందరి నమ్మకం.

అయితే ఎలాంటి వైద్య సేవలు తీసుకోకుండా ఇదొక్కటే నయం చేస్తుందని కూడా స్పష్టంగా చెప్పలేం. ఎందుకంటే ఆధ్యాత్మిక దీక్షలు మనసుని బలపరుస్తాయి కానీ వైద్య చికిత్సను భర్తీ చేయలేవు.

ఎందుకంటే శ్రీరామకృష్ణుడు..తన గొంతు క్యాన్సర్ ను దైవిక లీలగా భావించారు కానీ ఆధ్యాత్మికత రోగాన్ని నయం చేయలేదు.. అది మరణానికి దారితీసింది. ఫలితం కేవలం భక్తి, ఉద్దేశం, కర్మలపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు ఆధ్యాత్మికవేత్తలు.

## రఘురామకృష్ణంరాజు అబద్దాలు బయటపడుతున్నాయి

విజయవాడ సస్పెన్షన్ లో వున్న ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ రఘు కృష్ణంరాజుపై మరో సంచలన ట్వీట్ చేసారు. క్రికెట్ ఆడుతుండగా రఘురామకు కాలు, చెయ్యి విరగటంపై ట్వీట్ చేసారు. జస్ట్ అలా పడిపోతేనే రెండు చోట్ల ఎముకలు విరిగాయి. నిజంగా కస్టడిలో ఎవరైనా కొట్టి ఉంటే ఎన్ని ఫ్రాక్చర్లు ఉండాలి. అది కూడా ఆయన వర్ణించిన అంత దారుణంగా కొడితే. అబద్ధాలు బయట పడుతున్నాయి. నిజం దాగదని అన్నారు.

## జీఐ ఆర్ట్ బస్సులను ప్రారంభించిన గవర్నర్



హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే మొట్టమొదటిసారిగా "జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ఆన్ వీల్స్" జీఐ ద్వారా గుర్తించిన సాంస్కృతిక ,కళాత్మక చిత్రాలతో రూపొందించిన బస్సులను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన,ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.బస్సులపై జీఐ ఆర్ట్ తెలంగాణ సంస్కృతి , సాంప్రదాయ కళలు, చేతిపనులపై అవగాహనను తెస్తుంది. పర్యాటక అభివృద్ధి. చేతివృత్తులవారిని ప్రోత్సహిస్తుంది.

జీఐ ఆర్ట్ వర్క్ ఉన్న ఆరు ఎక్స్ప్రెస్ బస్సులు శుక్రవారం ప్రారంభించారు.

## కొత్త వాహనాలపై రోడ్ సెస్

వరంగల్, ఫిబ్రవరి 27, తెలంగాణలో కొత్తగా వాహనాల కొనుగోలు చేసేవారిపై అదనపు భారం పడనుంది. ప్రభుత్వం కొత్తగా 'రోడ్ సేఫ్టీ సెస్' పేరుతో అదనపు పన్నును విధిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. పన్ను మె?త్తం వాహన రకాలను బట్టి రూ.2 వేల నుంచి రూ. 10 వేలు వసూలు చేయనున్నారు.కొత్తగా వాహనాలు కొంటున్నారా..? అయితే మీ జేబుకు చిల్లు పడినట్లే. ఎందుకంటే రిజిస్ట్రేషన్ సమయంలోనే కొత్త అదనపు బాదుడుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త వాహనాల కొనుగోలుపై రోడ్ సేఫ్టీ సెస్ వసూలు చేయనున్నారు. ఈ మేరకు సెస్ చెల్లించే నిబంధన మార్చి 1 నుంచి అమల్లోకి రానుంది. మోటారు వెహికల్ యాక్ట్ చట్టంలో పన్నుల విధింపుపై రాష్ట్రానికి ఉన్న అధికారాల్ని వినియోగిస్తూ తెలంగాణ రవాణాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం.. నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా రోడ్డు భద్రత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, కార్లతోపాటుగా ఇతర వ్యక్తిగత వాహనాలు, గూడ్స్ వెహికల్స్, ప్రయాణికుల్ని తీసుకెళ్లే ఆటోలు ఈ విభాగం పరిధిలోకి వస్తాయి.కొత్త వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించే సమయంలో ఈ అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మూడు చక్రాల గూడ్స్ వాహనాలపై గతంలో క్వార్టర్లీ ట్యాక్స్ ఉండేది. రవాణాశాఖ తాజాగా దాన్ని లైఫ్‌ట్యాక్స్ పరిధిలోకి తీసుకు వచ్చింది. రోడ్డు భద్రత చర్యలకు అవసరమయ్యే నిధుల సమీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ అదనపు ట్యాక్స్ ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ ప్రయోజనాలకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రైలర్లకు మాత్రం పన్ను మినహాయింపు ఉంటుంది.ఈ ట్యాక్స్ పరిధిలోకి బైకులు, కార్లు, తేలికపాటి వాహనాలు వస్తాయి. ఇతర వాహనాల పరిధిలోకి 4 నుంచి 7 సీట్ల సామర్థ్యం ఉన్న ప్రయాణికుల ఆటోలు వస్తాయి. రోడ్డు భద్రత పన్ను బైకులు, స్కూటీలు వంటి ద్విచక్రవాహనాలకు రూ. 2 వేలు ఉంటుంది. కార్లు వంటి వాటికి రూ.5 వేలు వసూలు చేయనున్నారు. ఇతర వాహనాలు అంటే గూడ్స్ వెహికల్స్, ఆటోల్లో రూ.10 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడికి.. కొత్త వాహనం కొనేటప్పుడు ఈ అదనపు పన్ను ఖచ్చితంగా భారమే అవుతుంది. ఈ నిర్ణయంపై పునరాలోచించాలని వాహనదారులు కోరుతున్నారు. అయితే సర్కార్ మాత్రం పన్ను విధింపుపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంటోంది.

## అర్ధరాత్రి బైకు దహనం



కంచికచర్ల పట్టణం భావన థియేటర్ సమీపంలో రహదారిపై ఏపీ 16 టి ఎన్ 16 91 బైకును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఘటన జరిగింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు. బైకు అప్పటికే మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. కంచికచర్ల పోలీస్ స్టేషన్లో బైక్ మెకానిక్ భాష తన బైక్ ను తగలబెట్టాడంటూ నందా రాజేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసాడు.

## బెంజ్ సర్కిల్ ఏరియాలో ఎంపి నాని, ఎమ్మెల్యే గద్దె పర్యటన

విజయవాడ బెంజ్ సర్కిల్ లారీ ఓనర్స్ కళ్యాణ మండపం ఏరియాలో ఎంపీ కేశినేని శివనాథ్ , ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. నేషనల్ హైవే అధికారులు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వి.ఎం.సి అధికారులతో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.

ఎంపి మాట్లాడుతూ అతి త్వరలో కృష్ణలంక వాసులకు ఉపయోగపడే విధంగా కొత్త బస్టాండ్ నుంచి స్క్రూ బ్రిడ్జ్ వరకు ఫ్లై ఓవర్ రాబోతుంది. రాణిగారి తోట దగ్గర నేషనల్ హైవే అధికారులు శాంక్షన్ చేసిన సబ్ వే కి ఈ రోజు టెండర్లు ఓపెన్ చేయటం జరుగుతుందని అన్నారు.

గత ఐదు సంవత్సరాలు సిపిఐ, సీపీఎం మొద్దు నిద్రపోయారు. గత ఏడాది కాలంగా రాణిగారి తోట అండర్ పాస్ కోసం గద్దె రామ్మోహన్ తో కలిసి కష్టపడి శాంక్షన్ చేయించాం. సిపిఐ, సీపీఎం నాయకులు మేము నాలుగు సార్లు పరిశీలనకు వెళ్లిన తర్వాత మొద్దు నిద్ర లేచారు. గత ఐదేళ్లలో మేము గౌరవించే సిపిఐ, సీపీఎం నాయకులు ఎక్కడ వున్నారో మాకు తెలియలేదు. తెచ్చేవాళ్ళం,.ఇచ్చేవాళ్ళం మేము వుండగా ఉద్యమాల బాట ఎందుకు అంటూ ప్రశ్నించారు. తిరువూరు నియోజకవర్గం జి.కొండూరు లో మార్చి 15 వ తేదీ 18 గ్రామాలకు మంచినీరు అందించే వాటర్ ట్యాంకులు ప్రారంభించబోతున్నాము. పనులు పూర్తి చేస్తుంటే ...సీపీఐ సిపిఎం నాయకులు ఎందుకు ధర్నాలు చేస్తున్నారో అర్థం కావటం లేదు. విజయవాడ మున్సిపల్ కౌన్సిల్ నగరాభివృద్ధికి ఒక తట్టేటు మట్టి కూడా వేయలేకపోయింది. మరో పది రోజుల్లో విజయవాడ నగరానికి పట్టిన చీడ పోతుంది. గ్రేటర్ విజయవాడ అయ్యేలోపు నగరానికి ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి చేసి చూపిస్తాం. కమ్యూనిస్టులు సంస్థాగత విమర్శలు చేయాలని సూచించారు.

## చల్లా వెంకట్రామిరెడ్డి మొండోడు

హైదరాబాద్ చల్లా వెంకట్రామిరెడ్డి అన్న మొండోడు.. అనుకున్న పనిని చేసి చూపిస్తాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అయన ఎప్పుడు నా నియోజకవర్గం, నా జిల్లా బాగుండాలి అని అనుకునేవాడు. అధికారంలో ఉన్నన్ని రోజులు తన స్వంతానికి ఒక్క రూపాయి పని ఇవ్వమని అడగలేదు.. ఏం అడిగినా నా అలంపూర్ అని అనేవాడని అన్నారు.మా ప్రభుత్వం పోయాక నా దగ్గరికి వచ్చి, మా నియోజకవర్గానికి నీళ్ళు రావడం లేదు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఫోన్ చేసి చెప్పు అని పట్టుబట్టాడు. నేను జగన్మోహన్ రెడ్డికి ఫోన్ చేస్తే నాకు ఆల్రెడీ చేశాడు. ఇప్పుడు నీతో చేయిస్తున్నాడా అని ఆయన అన్నాడు.. అంత మొండోడు, కమిట్మెంట్ ఉన్నోడు చల్లా వెంకట్రామిరెడ్డి అని అన్నారు.

# అవినీతిఅరాచకమే కాంగ్రెస్ పాలన జోడెడ్లు

**– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ప్రజల విశ్వాసం గులాబీ జెండాపైనే ? నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రానికి కావాలి.**

**మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగురుతుంది.**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానం ? ఆలంపూర్ విజేతలకు కేటీఆర్ అభినందనలు.**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్లకు ఘన సన్మానం..**




ఆలంపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన కౌన్సిలర్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితర ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు.

కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని ఆయన విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.

నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో రూ.2.17కోట్ల రికార్డు స్థాయి హుండీ ఆదాయం

## రికార్డు స్థాయిలో ఆదాయం రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు

కొత్తపేట కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం జరిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో రికార్డు స్థాయిలో రూ.2.17 కోట్ల ఆదాయం లభించింది. గత 35 రోజుల కాలానికి గాను ఈ మొత్తం లభించింది. ఇందులో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయం మరియు శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా రూ.1,58,00,536/- నగదు, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.59,82,822ల నగదు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా భక్తులు సమర్పించిన కానుకలుగా 42 గ్రాముల 400మిల్లీ గ్రాముల బంగారం, 1 కిలో 280 గ్రాముల వెండి, అలాగే 13 దేశాలకు చెందిన 73 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలలో లభించాయని ఆలయ అధికారులు తెలిపారు.కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తలు సి హెచ్ రాంబాబు,సలాది నాగేశ్వరరావు, పి. భవాని, సి హెచ్.సత్యనారాయణ,ఎస్ సూర్య కుటుంబరావు, ఎమ్ త్రిమూర్తులు హాజరయ్యారు. పర్యవేక్షణాధికారులుగా మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం అసిస్టెంటు కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి (ఎఫ్ ఏ7 సీ) డి సురేశ్ బాబు, పలివెల గ్రూపు 2 దేవాలయాల ఈవో పి వి వి ఎస్ కామేశ్వరరావు, ఆత్రేయపురం గ్రూపు 3 దేవాలయాల ఈవో బి నరేంద్ర కుమార్ వ్యవహరించారు.హుండీ ఆదాయం లెక్కింపుకు కరూర్ వైశ్య బ్యాంక్, రావులపాలెం, కెనరా బ్యాంక్, రావులపాలెం వారు సహకారం అందించారు. అలాగే అర్చకస్వాములు, వేదపండితులు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, పత్రికా ప్రతినిధులు, పోలీసులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి ఢ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మాట్లాడుతూ ఈ సారి రికార్డు స్థాయిలో రూ2.17 కోట్ల ఆదాయం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు మాట్లాడుతూ భక్తుల సహాయ, సహకారాలతో ఆలయంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# మద్యం మత్తులో కన్న కూతుర్నే కడతేర్చిన ఘటన

## భార్యాభర్తల గొడవలే కారణమా?

## స్థానికుల సహాయంతో హాస్పిటల్ తీసుకెళ్లిన దక్కని ఫలితం

మద్యం మత్తులో కన్న తండ్రే కూతుర్ని కడతేర్చిన ఘటన కాకినాడ జిల్లా జగ్గంపేటలో చోటుచేసుకుంది. వాయిస్ ఓవర్: జగ్గంపేట శెట్టిబలిజి పేటకు చెందిన ఒడిబోయిన మణికంఠ భార్య ఇద్దరు కుమార్తెలతో టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం తన భార్య సాయితో ఘర్షణ పడి 11 నెలల కుమార్తె ను తీసుకుని బయటకు వచ్చాడు. అలా వెళ్ళిన మణికంఠ బాలికతో సహ పోలవరం కాలువలోకి దూకాడు. శబ్దాన్ని విన్న స్థానికులు వారిని రక్షించగా వైసిపి నేత ఒమ్మి రఘురామ్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నన్ను గాయపరిచి నా కూతుర్ని తీసుకువెళ్లి ఇలా శవంగా మార్చాడని తల్లి సాయమ్మ ఆవేదనతో ఆరోపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారుఈ సందర్భంగా సిఐ సూర్య అప్పారావు మాట్లాడుతూజగ్గంపేట గ్రామానికి చెందిన సాయమ్మ అనే ఆమెకు సుమారు ఒక సంవత్సరంన్నర క్రితం జగ్గంపేట గ్రామము టవర్ కాలనీ ఏరియా కు చెందిన మణికంఠతో ప్రేమ వివాహం జరిగిందనీ, వారి దాంపత్య జీవితములో వారికి 11 నెలల పాప ఉందనీ,వారు ఇరువురు తరుచూ గొడవలు పడుతున్నట్లు, గురువారం మధ్యాహ్నం సుమారు 2.00 గంటల ప్రాంతంలో సాయమ్మ ,మణికంఠ జరిగిన గొడవల కారణంగా ఆవేశంతో, చనిపోవాలనే ఉద్దేశం తో తన 11 నెలల పాపను తన యొక్క మోటార్ సైకిల్ పై ఎక్కించుకుని జగ్గంపేట శివారు గుర్రం పాలెం రూట్ లో గల పోలవరం కాలువలోకి మోటర్ సైకిల్ తో పాపతో సహా ఆత్మ హత్య చేసుకోవాలని కాలువ లోనికి వెళ్ళి పోగా అది చూసిన వారు రక్షించడానికి ప్రయత్నించగా పాప చనిపోగా అతను బ్రతికినాడనీ అన్నారు. తన భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనినీ అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని తెలిపారు.

# నారాయణ స్కూలు బస్సుకు ప్రమాదం..

## విద్యార్థులకు స్వల్ప గాయాలు

రంగారెడ్డి శంకర్ పల్లి మోకిల వద్ద టిప్పర్ ను నారాయణ పాఠశాల బస్సు ఢీకొట్టింది. ఘటనలో విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. స్కూల్ బస్ డ్రైవర్ పరారి అయ్యాడు. ఈరోజు పాఠశాల బస్సు డ్రైవర్ కాకుండా డ్రైవర్ కొడుకు వాహనాన్ని నడిపినట్లు విద్యార్థులు తెలిపారు.

మోకిలా నుంచి శంకర్పల్లి వస్తుండగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద స్పీడ్ బ్రేకర్ల దగ్గర ముందున్న టిప్పర్ ను పాఠశాల బస్సు డ్రైవర్ ఢీకట్టాడు.

# కోల్కతాలో భూకంపం...

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలో కొద్దిసేపటి క్రితం భూకంపం సంభవించింది. రిక్టార్ స్కేలుపై దీని తీవ్రత 5.0గా నమోదైంది. బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు సమాచారం. భూప్రకంపనల ధాటికి కార్యాలయాలు, అపార్ట్మెంట్ల నుంచి ప్రజలు భయంతో పరుగులు తీశారు. కోల్కతాతో పాటు సమీప జిల్లాల్లోనూ ఈ ప్రభావం కనిపించినట్లు తెలుస్తోంది. ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎల్బీనగర్లో ఉద్రిక్తత

హైదరాబాద్ ఎల్బీనగర్లో సురేష్ అనే వ్యక్తిపై 30 మంది దుండగులు దాడి చేసి, కారును ధ్వంసం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాధితుడికి గాయాలవ్వగా.. దాడి చేసిన వారికి పోలీసులు మద్దతు తెలుపుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి విషమించకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# రావులపాలెంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

## కొత్తపేట నియోజకవర్గం..

రాజమండ్రిలో కల్తీ పాలు ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన ఉన్నతాధికారులుఇటీవల రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి కొందరు మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టారు.కోనసీమ జిల్లా ఆహార భద్రత అధికారి (ఫుడ్ ఇన్స్పెక్టర్) యేపూరి రామయ్య ఆధ్వర్యంలో రావులపాలెం పట్టణంలోని పలు పాల కేంద్రాలు, మిల్క్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాలు నిల్వ విధానం, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.పలు కేంద్రాల నుంచి పాలు శాంపిళ్లు సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నమూనాల్లో విషపదార్థాలు లేదా కల్తీ పదార్థాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అమ్మందారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు నాణ్యమైన పాలను మాత్రమే వినియోగించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆహార భద్రతాధికారులు సూచించారు.ఇటీవలి ఘటనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు.

# కడిగిన ముత్యంలా బయటకు వచ్చాను

## న్యాయవ్యవస్థపై నమ్మకం నిలబడింది

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్ ఢిల్లీ లిక్కర్ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఊరట కలిగింది. రౌస్ అవెన్యూ కోర్టు ఆమెకు క్లిన్ చిట్ ఇచ్చింది. సిబిఐ నమోదు చేసిన అభియోగాలు కొట్టివేసింది. దాంతో కవితతో పాటు 23 మందికి ఊరట కలిగింది. లిక్కర్ కేసులో ఊరట పొందిన వారిలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత ఆరవింద్ కేజ్రీవాల్,ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా వున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ మార్చి 15 న కవితను అరెస్టు చేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఏప్రిల్ 11 న కవితను అరెస్టు చేసినట్లు సిబిఐ ప్రకటించింది. కవిత దాదాపు ఐదు నెలల పాటు జైల్లో ఉన్నారు.

కవిత మాట్లాడుతూ రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు చెప్పాను. ఈ కేసు వల్ల నేను నా కుటుంబం దాదాపు ఐదన్నర నెలలపాటు క్షోభ అనుభవించామని అన్నారు. కష్ట సమయంలో నాకు అండగా ఉన్న అందరికీ ధన్యవాదాలు. ఈ తీర్పు తో మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాను. కోర్టు తీర్పు రాకుండానే కొందరు నాపైన అనుచితంగా మాట్లాడారు. కడిగిన ముత్యం లాగా బయటికి వస్తానని గతంలోనే అనేక సార్లు చెప్పాను. అదేవిధంగా ఈరోజు బయటికి వచ్చాను. తెలంగాణ ప్రజలకు మొదటి నుంచి ఈ కేసులో నా పాత్ర లేదని చెప్పాను. న్యాయవ్యవస్థ పై పెట్టుకున్న నమ్మకం నిలబడిందని అన్నారు.

# సల్కం చెరువు లో ఉన్న కాలేజీ ని కూల్చి గాంధీ విగ్రహం పెట్టాలి

## ఎంపీ రఘునందన్ రావు



హైదరాబాద్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోనే వెయ్యి కోట్ల పంపించే స్థాయికి ఎలా చేరారో సమాధానం చెప్పాలని ఎంపి రఘునందన్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై సిబిఐ విచారణ కు కేంద్రం సిద్ధంగా ఉంది . కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం లో కుంగిన బ్యారేజీలపై విచారణ చేసింది . మూడు పియర్లపైనే విచారణ జరపాలని మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం కోరింది. ఇప్పటికే ఈ అంశం లో విచారణ పై కేసీఆర్, హరీష్ ల విచారణ పై కోర్టు స్టే ఇచ్చింది . కాళేశ్వరం కేసు పై స్టే ఎత్తివేయగానే విచారణ ప్రారంభిస్తాం .రాష్ట్రంలో జరుగుతున్న అనైతిక పాలనను ప్రజలు ప్రశ్నించకుండా డైవర్ట్ చేస్తున్నారని అన్నారు.

అక్బరుద్దీన్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఓల్డ్ సిటీ లో హనుమాన్ దేవాలయంను రోహింగ్య లు ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు . రోహింగ్యాలను అండగా ఉంటున్నది ఎంఐఎం పార్టీ. అసదుద్దీన్ సల్కం చెరువు లో ఉన్న కాలేజీ ని కూల్చి గాంధీ విగ్రహం పెట్టాలని హైడ్రా రంగనాథ్ ను కోరాలి. అమాయకులు ఉండే అపాయింట్మెంట్ లను కూల్చి గాంధీ విగ్రహం పెట్టే బదులు ఓల్డ్ సిటీ లో సల్కం చెరువు లో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. నరేంద్ర మోదీ ఎవరికీ ఇబ్బందులు లేకుండా నిర్వాసితులకు పునరావాసం కల్పించి సబర్మతి డెవలప్ చేశారు. అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్న అపాయింట్మెంట్ ను కూల్చే అధికారం ఎవరికీ లేదని అన్నారు.

# చారిత్రాత్మక వెంకటగిరిలో పరిశ్రమలు స్థాపించాలి

**మినీ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రత్యేక హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటు చేయాలి**

**– అసెంబ్లీలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి**

వెంకటగిరి, ఫిబ్రవరి 27, తిరుపతి జిల్లాలో అత్యంత ప్రఖ్యాతి గాంచిన, చారిత్రాత్మక వారసత్వం కలిగిన వెంకటగిరి నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి అవకాశం కల్పించిన సభాపతికి కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలో యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వారు పొరుగు రాష్ట్రాలైన చెన్నై, కర్నాటక తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ వలసలను అరికట్టాలంటే వెంకటగిరిలో చిన్నతరహా పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో మినీ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.వెంకటగిరి పట్టు చీరలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, నేత కార్మికులు దళారుల చేతిలో మోసపోతున్న పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. డిజైనింగ్ నుంచి ఫినిషింగ్ వరకు ఒకే చోట ఉత్పత్తి ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక హ్యాండ్‌లూమ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడి, మధ్యవర్తుల ఆధిపత్యం తగ్గుతుందని వివరించారు.పట్టు, జరీ వంటి ముడి సరుకులపై సబ్సిడీ పెంచి కార్మికులను ఆదుకోవాలని కోరారు. నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉత్సాహవంతులైన యువతకు సరైన ప్రోత్సాహం కల్పిస్తే వెంకటగిరి మళ్లీ తన పాత వైభవాన్ని సంతరించుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటు చేసి, మార్కెటింగ్ వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు.

# బొత్సకు బ్రెయిన్ స్ట్రోక్

వైఎస్సార్ సీపీ. నాయకుడు , ఏపీ శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ నిన్న రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. దీంతో ఆయనను నిన్న హైదరాబాద్‌కు తరలించారు. సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## ప్రేమ వివాహం నేపథ్యంలో ప్రియుడిపై కత్తి దాడి

## తీవ్రగాయాలపాలయిన యువకుడు

హైదరాబాద్ చెల్లిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడన్న కోపంతో యువకుడి పై యువతి అన్నలు దాడి చేసారు. నేరెడ్మెట్కు చెందిన అజయ్, రామలింగంపల్లికి చెందిన యువతి గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. మూడు రోజుల క్రితం యువతిని అజయ్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. విషయం తెలిసి యువతికి కుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకువెళ్లారు. బుధవారం యువతి మొబైల్ నుండి రామలింగంపల్లికి రావాలంటూ అజయ్కు మెసేజ్ యువతి సోదరుడు చేసాడు. తనను తాను ప్రియురాలే పిలిచిందని అజయ్ వెళ్లాడు. రామలింగంపల్లి గ్రామ శివార్లలోకి రాగానే అజయ్ పై విచక్షణా రహితంగా దాడి చేసారు. అజయ్ కళ్లలో కారం చల్లి కత్తులతో యువతి సోదరుడు, అతని స్నేహితులు దాడి చేసారు. అజయ్ పై 14 సార్లు కత్తితో దాడి జరిగింది. అపాస్మరక స్థితిలో పడిపోవడంతో చనిపోయాడని భావించి అక్కడి నుండి వాళ్లంతా వెళ్ళిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అజయ్ ని గాంధీకి తరలించారు. అజయ్ చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## కోల్కతాలో భారీ భూకంపం..

## రిక్టర్ స్కేల్పై 5.5 తీవ్రత నమోదు



కోల్కతా ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలో భారీ భూకంపం సంభవించింది. శుక్రవారం మధ్యాహ్నం 1:22 గంటల సమయంలో రిక్టర్ స్కేల్పై 5.5 తీవ్రత నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్సీఎస్) తెలిపింది. భూకంప కేంద్రం బంగ్లాదేశ్లో ఉన్నట్లు పేర్కొంది. పది కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు వెల్లడించింది. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని పలు జిల్లాలపై భూకంపం ప్రభావం ఉన్నట్లు వివరించింది.కాగా, కోల్కతాలోని పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. పలు ఇళ్లల్లోని సామాన్లు, ఫ్యానులు ఊగిపోయాయి. భయాందోళన చెందిన జనం ఇళ్లు, భవనాలు, కార్యాలయల నుంచి బయటకు పరుగులుతీశారు. కోల్కతాలో భూకంపం వల్ల ఎంత నష్టం జరిగింది అన్నది ఇంకా తెలియలేదు. ఈ భూకంపానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## డిప్యూటీ తాహసీల్దార్తో ప్రేమవివాహం...

## యువకుడిని రాళ్లతో కొట్టి చంపిన యువతి బంధువులు



అమరావతి ఫిబ్రవరి 27 ;: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో దారుణం చోటు చేసుకుంది .ప్రేమ పెళ్లి చేసుకున్నాడని యువతి కుటుంబ సభ్యులు యువకుడిని కొట్టి చంపారు. ఈ సంఘటన రాష్ట్రం లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంధ్య అనే యువతి, సూర్య ప్రకాశ్ అనే యువకుడు గాఢంగా ప్రేమించుకున్నారు. ప్రేమ పెళ్లి యువతి కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో గురువారం అన్నవరంలో సూర్య-సంధ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. సంధ్య అన్నదమ్ములు కోపంతో రగిలిపోయారు. సూర్య ప్రకాశ్ ఇంటికి వెళ్లి అతడిని రాళ్లతో కొట్టి చంపారు. ప్రస్తుతం రాయవరంలో సంధ్య డిప్యూటీ తాహసీల్దార్గా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

## పేదల ఇళ్లు కట్టాల్సింది పోయి..కూల్చడంలో పోటీ పడతారా: బండి సంజయ్



ఖమ్మం ఫిబ్రవరి 27 : పేదల ఇళ్లు కూల్చితే..మీ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఖమ్మంలో మంత్రుల తీరు దారుణంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేదల ఇళ్లు కూలగొట్టి కబ్జా చేస్తారా? అని.. కట్టాల్సింది పోయి..కూల్చడంలో పోటీ పడతారా? అని బండి ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎమ్ఐఎమ్ డ్రామాలు ఎవరూ నమ్మరని, బిఆర్ఎస్ మార్గంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. రైతు భరోసా ఇస్తామని రైతులను సిఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మాజీ సిఎం కెసిఆర్ ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ రెడ్డికు లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

## ఏకాదశి సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి బుక్కవారి ఒడిబియ్యం



**ప్రజాబలం దినపత్రిక వేములవాడ (ఫిబ్రవరి - 27)**

వేములవాడ పట్టణంలోనీ శుక్రవారం ఏకాదశి సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పట్టణానికి చెందిన బుక్క కుల మహిళలు సుమారు 70 మంది లోక కళ్యాణార్థం అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫలహారాలు,చీరే, సారే, ఒడిబియ్యం సమర్పించడం జరిగింది. ముందుగా మొదటి బైపాస్ రోడ్డు నుంచి మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు కోలాటాలతో నగర సంకీర్తన చేసినారు.తదనంతరం మహిళలు అమ్మవారి అష్టోత్తర నామాలను 108 సార్లు జపించారు మహిళలు ఒకరికి ఒకరు పసుపు బొట్టు చెల్లించి, నూతన వస్త్రాలను వాయినంగా ఇచ్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి బుక్క కుల మహిళలు వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ తదితర పట్టణాలకు చెందిన దేవరకొండ అరుణకుమారి, బండి శైలజ, బండి వనిత, దేవరకొండ విద్య, కామారపు అనంతలక్ష్మి, కామారపు చంద్రిక, కామారపు సత్యలక్ష్మి, చింతల భాగ్యలక్ష్మి, చింతల విజయ, చింతల స్వరూప, దేవరకొండ జయశ్రీ, కామారపు వాణి, కామారపు మౌనిక, కామారపు శైలజ, దేవరకొండ వాసు తదితర 70 మంది బుక్క కులస్తులు పాల్గొనడం జరిగింది.

## తిరుపతిలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం

## ప్రభుత్వం దగ్గర ప్రతిపాదన లేదు

అమరావతి తిరుపతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణంపై మంత్రి నారాయణ అసెంబ్లీ లో సమాధానం ఇచక్చారు.

నారాయణ మాట్లాడుతూ తిరుపతిలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదు. తిరుపతి లో 4.5 లక్షల జనాభా ఉన్నారు. ప్రతిరోజూ 75,000 నుంచి లక్ష మంది తిరుపతికి వస్తుంటారు. ప్రతిరోజూ 54.5 ఎంఎల్డీ ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. మొత్తం 408.4 కిమీ ల పరిధిలో యూజీడీ అవసరం ఉందని అన్నారు.

ప్రస్తుతం 284.3 కిమీ పరిధిలో నెట్వర్క్ ఉండగా...మరో 125 కిమీ చేయాల్సి ఉంది. పాత నెట్వర్క్ లో 60 కి.మీ పరిధిలో మార్చాల్సిన అవసరం ఉంది. పాత వాటిని మార్చడం తో పాటు కొత్తగా లైన్ వేయాలంటే 152.45 కోట్లు అవసరం అని అంచనా వేశారు. పాత వాటిలో 7.5 కి.మీ లైన్ మార్చేందుకు మార్చిలో టెండర్లు పిలుస్తున్నాం. మిగతా ప్రాంతంలో యూజీడీ కోసం నిధులపై కేంద్రం తో సంప్రదించి ముందుకెళ్తామని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా21,170 కి.మీ మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మించాల్సి ఉంది. దీని కోసం 24,000 కోట్లు అవసరం అవుతుంది. ప్రస్తుతం 3,334 కి.మీ మేర యూజీడీ వ్యవస్థ ఉంది. మరో 2,860 కి.మీ మేర పనులు జరుగుతున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పూర్తి చేయాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితి బట్టి యూజీడీ నిర్మాణంపై ముందుకెళ్తామని అన్నారు.

## మార్చి 17 నుండి 25వ తేదీ వరకు శ్రీ కోదండ రామస్వామివారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, 2026 ఫిబ్రవరి 27 మార్చి 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం? మార్చి 16న అంకురార్పణతిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 17 నుండి 25వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి.ఇందులో భాగంగా ఆలయంలో మార్చి 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మార్చి 16న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు.వాహన సేవలు ప్రతిరోజు ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 8:30 గంటల వరకు నిర్వహిస్తారు.

## విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం ? “అర్రైవ్ అలైవ్” కార్యక్రమం

### రోడ్డు ప్రమాదాల నివారణకు యువత ముందుకు రావాలిహెల్మెట్ ఢ ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే భద్రత ? యువత జాగ్రత్తగా నడిస్తేనే ప్రమాదాలకు చెక్

### ఒక నిర్లక్ష్యం రెండు కుటుంబాలను దెబ్బతీస్తుంది

### జీవితాన్ని కాపాడే జాగ్రత్తలు పాటించండి: ఎస్పీ డి.జానకి సూచనలు

మహబూబ్ నగర్ అర్రైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబ్నగర్ పట్టణంలోని ఏం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వంటి ప్రమాదకర అలవాట్ల వల్ల జరిగే ప్రమాదాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఇటీవల మహబూబ్నగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల చిత్రాలను ప్రదర్శించి, వాటిలో జరిగిన తప్పిదాలు, నిర్లక్ష్యాలను విశ్లేషిస్తూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని ఎస్పీ స్పష్టం చేశారు.

ఒక రోడ్డు ప్రమాదం జరిగితే కేవలం ప్రమాదానికి కారణమైన వ్యక్తి మాత్రమే కాదు, బాధితుడి కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. యువతలో ఈ వయసులో బైక్లు, కార్లు నడపడం థ్రిల్గా అనిపించినప్పటికీ సరైన అవగాహన లేకుండా, భద్రతా చర్యలు తీసుకోకుండా వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు.

మన ప్రాణాలే కాకుండా ఎదుటివారి ప్రాణాలు కూడా విలువైనవని, ఒక చిన్న నిర్లక్ష్యం రెండు కుటుంబాలను శాశ్వత దుఃఖంలో ముంచవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే.పద్మావతి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మహబూబ్నగర్ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, ఇతర పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయం గెలిచింది



హైదరాబాద్ ఢిల్లీ లిక్కర్ కేసు క్లీన్ చిట్ పై ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్పందించారు. మద్యం కుంభకోణం కేసు పేరుతో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఢిల్లీ లిక్కర్ కేసు ప్రభావం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పై పడింది. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ కేసు అని కోర్టు ద్వారా బహిర్గతమైంది. ఈ కేసులో కవితకు న్యాయం దక్కింది. కాంగ్రెస్,బిజెపి కుట్రలు తేటతెల్లం అయ్యాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో చివరికి న్యాయమే గెలిచిందని వ్యాఖ్యానించారు.

## రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు కేంద్ర ప్రభుత్వం చికిత్స నిమిత్తం రూ. 1,50,000లు

### బాధితుడిని ఆసుపత్రికి తీసుకువెళ్లిన వ్యక్తులకు 25వేల సహాయం

### రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్



పెద్దపల్లి ఫిబ్రవరి 27 : రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు కేంద్ర ప్రభుత్వం చికిత్స నిమిత్తం రూ. 1,50,000 వైద్య ఖర్చులతో పాటు బాధితుడిని ఆసుపత్రికి తీసుకువెళ్లిన వ్యక్తులకు 25వేల సహాయాన్ని అందిస్తుందని రామగుండం పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో లారీలు, స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన అవసరమైన వారికి అద్దాలను ఎసిపి పంపిణీ చేశారు. అంతేకాకుండా బిపి, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులను అందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి ఆసుపత్రిలో అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తద్వారా రోడ్డు ప్రమాదాలు నియంత్రణలోకి వస్తాయని తెలియజేశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలో వారం రోజులపాటు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకారం అందరూ హెల్మెట్ ధరించడంతో పాటు తద్వారా కుటుంబానికి ఆధారం అవుతారని చెప్పారు.

# భవన్స్ న్యూ సైన్స్ కాలేజీ లో నేషనల్ సైన్స్ డే-2026-ఇనోవిజన్-సెలబ్రేషన్




హైదరాబాద్, ఫిబ్రవరి 27 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నందుకు గుర్తుగా శుక్రవారం హైదరాబాద్‌లోని భవన్స్ న్యూ సైన్స్ కాలేజీ నారాయణగూడలో జాతీయ సైన్స్ దినోత్సవం–"ఇన్నోవిజన్"ను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.కార్యక్రమనీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కృష్ణరావు స్వాగత ప్రసంగంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం తర్వాత ప్రోగ్రామ్ పాట్రన్ మరియు సలహాదారు డాక్టర్ అశోక్ యాస్కీ వాతావరణ మార్పు, ఆరోగ్య సంరక్షణ పురోగతి మరియు స్థిరమైన అభివృద్ధి వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో సైన్స్ పాత్రను హైలైట్ చేశారు మరియు ప్రోగ్రామ్ చీఫ్ పాట్రన్ మరియు గౌరవనీయ చైర్మన్ డాక్టర్ ఎస్. జైకిషన్ విద్యార్థులు ఉత్సుకత, విమర్శనాత్మక ఆలోచన మరియు ఆవిష్కరణలను పెంపొందించుకోవాలని కోరారు. భవిష్యత్తును రూపొందించడంలో యువత పాత్రను నొక్కి చెబుతూ, పరిశోధన మరియు సాంకేతిక పురోగతిలో చురుకుగా పాల్గొనమని ఆయన వారిని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ జైప్రకాష్ గౌతమ్ ప్రసంగించారు. ఆయన దేశ నిర్మాణం మరియు సామాజిక పురోగతిలో శాస్త్రీయ జ్ఞానం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.సమావేశాన్ని ఉద్దేశించి ప్రొఫెసర్ జైప్రకాష్ మాట్లాడుతూ, సైన్స్ అనేది ఉత్సుకత, తార్కిక తార్కికం మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించే ఆలోచనా విధానం అని అన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ఊహలను ప్రశ్నించాలని మరియు ప్రయోగాలలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు.సర్ సి.వి.రామన్ రాసిన రామన్స్ ఎఫెక్ట్ ఆఫ్ లైట్ వంటి గొప్ప శాస్త్రవేత్తల నుండి ప్రేరణ పొందేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఆవిష్కరణ మరియు అంకితభావం ద్వారా దేశ వృద్ధికి దోహదపడాలని యువతకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని కళాశాల విద్యార్థులకు ఆయన హృదయపూర్వకంగా స్వాగతం పలికారు మరియు సహకార పరిశోధన కార్యక్రమాల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు.ఈ కార్యక్రమం విద్యార్థులు తమ జ్ఞానం, పరిశోధనా దృక్పథం, విశ్లేషణాత్మక నైపుణ్యాలు మరియు సృజనాత్మకతను పోటీ మరియు విద్యా వాతావరణంలో ప్రదర్శించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ వేడుకలో సైన్స్ పిపిటి ప్రెజెంటేషన్లు, ప్రదర్శనలు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, క్విజ్ మరియు చర్చా పోటీలు కూడా జరిగాయి, అత్యుత్తమ పాల్గొనేవారికి బహుమతులు ప్రదానం చేయబడ్డాయి.సైన్స్ దినోత్సవాన్ని శాస్త్ర విభాగానికి చెందిన అంకితభావంతో కూడిన బోధనా అధ్యాపకులందరూ సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ధన్యవాదాలతో ముగిసింది, ఈ వేడుక హాజరైన వారందరికీ సమాచారం అందించేదిగా మరియు ప్రేరణ కలిగించేదిగా ఉంది.





# పాతబస్తీలో చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఓవైసీ కాలేజీని మాత్రం హైడ్రా ఎందుకు కూల్చడం లేదు?రేవంతుద్దీన్, అక్బరుద్దీన్ ఇద్దరూ దోస్తులే..

## బిజెపి రాష్ట్ర అద్యక్షులు రామచంద్ర రావు



హైదరాబాద్ ఫిబ్రవరి 27 ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆధ్వర్యంలో డాక్టర్ అనూప్ గారు తమ అనుచర బృందంతో కలిసి పెద్దఎత్తున బిజెపిలో చేరారు. సామాజిక స్పృహతో సేవలందిస్తున్న వారిని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మేధావులు, విద్యావంతులు బిజెపి వైపు ఆకర్షితులవుతున్నారు. బిజెపి సిద్ధాంతం, దేశాభివృద్ధిపై మా దృష్టి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందనడానికి ఇదే నిదర్శనం.ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన, పారదర్శక పాలన, పనితీరుపై దేశవ్యాప్తంగా ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు.. అందుకే వరుసగా వివిధ రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ అద్భుత విజయాలు సాధిస్తోంది. అదే సరళి ఇప్పుడు తెలంగాణలో కూడా మొదలైంది. ముఖ్యంగా యువత ఇతర పార్టీల నుంచి బిజెపిలో చేరుతోంది.యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ ముస్లింల వ్యతిరేకులు అంటూ అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు నాటకంలో భాగంగా చేసి చిల్లర రాజకీయ వ్యాఖ్యలే తప్ప మరొకటి కాదన్నారు..గతంలో ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి స్వయంగా "కాంగ్రెస్ ఈజ్ ముస్లిం, ముస్లిం ఈజ్ కాంగ్రెస్" అని బహిరంగంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింల పార్టీ అని కూడా ప్రకటించారు. ఇది వారి రాజకీయ దృక్పథాన్ని స్పష్టంగా చూపిస్తోంది.మజ్లిస్ పార్టీ కాంగ్రెస్‌తో అంటకాగుతోందన్న విషయం ప్రజలకు అర్థమవడంతో, ఆ భయంతోనే రేవంత్ రెడ్డి అక్బరుద్దీన్‌తో మాట్లాడి ఇలాంటి వ్యాఖ్యలు చేయించినట్లు స్పష్టంగా తెలుస్తోంది.అక్బరుద్దీన్, రేవంత్ రెడ్డి ఇద్దరూ దోస్తులే. ఎప్పుడూ కలిసే ఉంటారు. బయట మాత్రం నాటకాలు ఆడుతూ, అక్బరుద్దీన్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడినట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆయన కాంగ్రెస్‌కు గానీ, సీఎంకు గానీ నిజంగా వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఇద్దరి మధ్య పక్కా అండర్‌స్టాండింగ్ ఉంది. అందుకే కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌కు కొమ్ముకాస్తోందని విమర్శించారు.కాంగ్రెస్–మజ్లిస్ పార్టీల మతపరమైన రాజకీయాలు ప్రజలకు ఇప్పుడు పూర్తిగా అర్థమయ్యాయి. ఈ కారణంగానే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమకు నష్టం జరుగుతుందన్న భయంతో సీఎం రేవంత్ రెడ్డి అక్బరుద్దీన్ చేత ఈ వ్యాఖ్యలు చేయించారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్–కాంగ్రెస్–ఎంఐఎం పార్టీలు కలిసి బిజెపి గెలుపును అడ్డుకునే ప్రయత్నం చేశాయి. అదే వ్యూహంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీని గెలవనీయొద్దన్న ఉద్దేశంతోనే ఈ డ్రామా రాజకీయాలు చేస్తున్నాయి.రేవంత్ రెడ్డి చేతిలో గడ్డపార పట్టుకుని పేద ప్రజల ఇళ్లను కూల్చుతున్నారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో కూడా పేద ప్రజల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం అర్బన్ వెలుగుమట్లలో పేదల ఇళ్లను కూల్చారు. కానీ పాతబస్తీలో చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఓవైసీ కాలేజీని మాత్రం హైడ్రా ఎందుకు కూల్చడం లేదు? ఇది స్పష్టమైన వివక్ష.ఎంఐఎం–కాంగ్రెస్ పార్టీలు మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. రేవంతుద్దీన్, అక్బరుద్దీన్ ఇద్దరూ దోస్తులే. హైదరాబాద్ తెలంగాణ గుండెకాయ లాంటిది. ఆ నగరాన్ని కబ్జా పెట్టేందుకే ఈ రాజకీయ నాటకాలు. అందుకే హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.

# చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సౌందర రాజన్ మృతి

హైదరాబాద్ ఫిబ్రవరి 27 : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌందర రాజన్ శుక్రవారం పరమపదించారు.ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్టర్ గా పదవి విరమణ పొందిన తరువాత ఆలయంలో ఉంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ఆయన చిలుకూరు బాలాజీ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. వీసాల దేవుడిగా నామకరణం వచ్చే విధంగా కృషి చేశారు. సౌందర రాజన్ మృతితో ఈరోజు, రేపు రెండు రోజులు ఆలయాన్ని మూసివేసే అవకాశం ఉందని తెలిసింది



# నరేంద్ర మోదీ మిషన్ విజన్ పత్రం లోగో, కవర్ పేజీల ఆవిష్కరణ లోగో, కవర్ పేజీలు ఆవిష్కరించిన డా. కె. లక్ష్మణ్



హైదరాబాద్ ఫిబ్రవరి 27 తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు రూపొందించిన శ్రీ నరేంద్ర మోదీ మిషన్?విజన్ పత్రం త్రిభాషా మూడు సంపుటాల ప్రాజెక్ట్‌కు సంబంధించిన లోగో, కవర్ పేజీలు (ముఖచిత్రాలు)ను బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ ఆవిష్కరించారు.శుక్రవారం నాడు హైదరాబాద్ అశోక్ నగర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమం ప్రాజెక్ట్ ప్రగతిలో కీలక ఘట్టంగా నిలిచింది. ఈ సందర్భంగా డా. కె. లక్ష్మణ్ మాట్లాడుతూ సమకాలీన నాయకత్వం, పరిపాలనా మైలురాళ్లను పత్రరూపంలో సమగ్రంగా అందించే ఇలాంటి గ్రంథాలు అధ్యయన అవసరాలకు, ప్రజల్లో అవగాహన విస్తరణకు ఉపయోగకరంగా నిలుస్తాయని పేర్కొన్నారు.డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు రూపొందించిన ఈ త్రిభాషా ప్రచురణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవన ప్రయాణం, నాయకత్వ మైలురాళ్లు, విధాన కార్యక్రమాలు, జాతీయ స్థాయి కృషిని సమగ్రంగా ప్రతిబింబించే మూడు సంపుటాల సూచిక గ్రంథంగా సిద్ధమవుతోంది. ఈ గ్రంథాల రచనా ప్రక్రియ గత ఐదు నెలలుగా నిరంతరంగా కొనసాగుతోంది.ఆవిష్కరించిన లోగో, కవర్ పేజీలు ప్రాజెక్ట్ పూర్తయ్యేంత వరకు అధికారిక రూపంగా వినియోగంలో ఉంటాయి. త్రిభాషా సంపుటాల కవర్ పేజీలు అన్ని అధికారిక అవసరాలు, సోషల్ మీడియా ప్రసారం కోసం వినియోగించబడతాయి.మార్చి నెల చివరి వారంలో న్యూఢిల్లీలో ఈ త్రిభాషా గ్రంథాల ఆవిష్కరణ నిర్వహించబడుతుంది. తెలుగు, ఆంగ్లం, హిందీ మూడు భాషల్లో ఈ గ్రంథాలు వెలువడనున్నాయి.

# ఇది ప్రభుత్వం కాదు.. రియల్ ఎస్టేట్ కంపెనీ.. :కేటీఆర్

ఖమ్మం ఫిబ్రవరి 27 జిల్లాలోని భూదాన్ భూముల్లో ఇండ్లపైకి బుల్డోజర్లు పంపించి కూల్చివేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెయ్యి కోట్ల రూపాయలను గాంధీ కుటుంబానికి పంపుతానని సీఎం రేవంత్ రెడ్డి ప్రామిస్ చేశాడని.. అందుకే పేదల ఇళ్లు కూల్చి, భూములు అమ్మి డబ్బులు రెడీ చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. పేదల ఇండ్లు కూలగొడుతూ.. హైదరాబాద్‌లో తన రెండో ప్యాలెస్ కట్టుకుంటున్నాడని విమర్శించారు.పేదల ఇండ్లు పెకిలించి వేస్తూ.. మరో పక్క తన కోటకు గోడలు కట్టడానికే కేవలం తొమ్మిది కోట్లు ఖర్చు చేస్తున్నాడని ముఖ్యమంత్రిపై కేటీఆర్ మండిపడ్డారు. భట్టి విక్రమార్క మూడో ఇంటిని కట్టుకుంటున్నాడని.. పొంగులేటి పదో కంపెనీ పెట్టి కమీషన్లు వెనకేసుకుంటున్నాని విమర్శించారు. పేదల జీవితాలను మాత్రం రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం కాదు, రియల్ ఎస్టేట్ కంపెనీ.. వీళ్ళు మంత్రులు కాదు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు అని విమర్శించారు.



# పాకిస్థాన్ బోర్డర్‌లో హెలికాప్టర్ ప్రచండ్‌లో విహరించిన రాష్ట్రపతి ముర్ము



న్యూ డిల్లీ ఫిబ్రవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇవాళ లైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్‌లో విహరించారు. సుమారు 25 నిమిషాల పాటు ఆమె సోర్టీ నిర్వహించారు. భారత్, పాకిస్థాన్ బోర్డర్‌లో ఉన్న జైసల్మేర్ జిల్లాలో ముర్ము విహరించారు. జైసల్మేర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి హెలికాప్టర్ టేకాఫ్ తీసుకున్నది. టేకాఫ్‌కు ముందు ఆ హెలికాప్టర్ గురించి రాష్ట్రపతి ముర్ముకు కెప్టెన్ బ్రీఫింగ్ ఇచ్చారు. కాక్‌పిట్ నుంచి ఆమె చేతులు ఊపారు. సైనిక దళాల సుప్రీం కమాండర్ హోదాలో ముర్ము విహరించారు.స్వయం సమృద్ధికి శక్తివంతమైన సంకేతంగా ప్రచండ హెలికాప్టర్ నిలుస్తుందని, జైసల్మేర్ జిల్లాలో విహరిస్తున్నానని, మన వీరోచిత సైనికులకు హృదయపూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నానని ముర్ము ఆ హెలికాప్టర్ కాక్‌పిట్ నుంచి సందేశం వినిపించారు. సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని, జై హింద్, జై భారత్ అని ఆమె అన్నారు. పోక్రాన్ ఫైరింగ్ రేంజ్ సమీపంలో హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. ఇక్కడే ఇవాళ సాయంత్రం వాయు శక్తి పేరుతో విన్యాసాలు నిర్వహించనున్నారు.ఇవాళ్టి సోర్టీతో యుద్ధ హెలికాప్టర్‌లో ప్రయాణించి తొలి భారత రాష్ట్రపతిగా ముర్ము రికార్డు క్రియేట్ చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆమె అంబాలా ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన విషయం తెలిసిందే. 2023 ఏప్రిల్‌లో ఆమె సుఖోయ్-30 ఎంకెఐ ఫైటర్ ప్లేన్‌లో ఎగిరారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ ఎల్‌సీహెచ్ ప్రచండ హెలికాప్టర్‌ను నిర్మించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని డిజైన్ చేసి డెవలప్ చేశారు. అడ్వాన్స్‌డ్ ఏవియానిక్స్, స్టీల్త్ ఫీచర్స్, నైట్ అటాక్ కెపాసిటీ, ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ తీసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉన్నది.

# వికలాంగునిపై మునిసిపల్ సిబ్బంది దౌర్జన్యం



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 27 ఫిబ్రవరి 2026**నెక్నంపూర్ డివిజన్ పరిధిలోని అలకాపూర్ లో గల మహాత్మాగాంధీ పార్కు వద్ద గత మూడు రోజుల క్రితం ఒక వికలాంగుడు స్థానిక నాయకులకు హప్త మాములు ఇవ్వనందున మున్సిపల్ సిబ్బంది ఇబ్బంది పెట్టిన విషయం తెలిసిన విషయం కాగా, ఈ రోజు ఒక బల్ల పై తన అమ్మకాలను కొనసాగిస్తున్నను మునిసిపల్ సిబ్బంది డిజాస్టర్ బండి తీసుకొని వచ్చి అట్టి బల్లను చెల్లచెదారం చేసి తీవ్ర నష్టం తలపెట్టిన చర్యలను బి ఆర్ ఎస్ స్థానిక పార్టీ నాయకులు తీవ్రముగా ఖండిస్తూ, అతనికి జరిగిన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అవసరమైతే డిప్యూటీ కమిషనర్ కార్యాలయము వద్ద నిరసన కార్యక్రమం చేపట్ట గలమణి హెచ్చరిస్తున్నాము.

# గ్రామాలలో ప్రతి షాపులో బెల్ట్ షాపు దందాలు పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిది ఫిబ్రవరి 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ఆందోల్ నియోజకవర్గం లోని, ఆయా మండల గ్రామాలలో, బెల్ట్ షాపులు విచ్చలవిడిగా, కొనసాగుతున్నాయి, గ్రామాలలో రైతులు వ్యవసాయ కూలీలు, ఉదయం లేవగానే, టీ కాఫీలతో మొదలు పెట్టాల్సిన దినచర్య, గ్రామాలలో ఉన్నటువంటి బెల్ట్ షాపుల ద్వారా మందు బాబులు మద్యం చుక్కతో మొదలు పెడుతున్నారు, కొన్ని గ్రామాలలో అయితే, ఉదయం 4, 5, గంటల నుండే మద్యం సేవిస్తూ, తమ జీవన విధానాన్ని, అలాగే ఆరోగ్యాన్ని కూడా పాడు చేసుకుంటున్నారు, దీంతో అనారోగ్యాల పాలై, దవఖానాలకు, డబ్బులు వెచ్చించుకుంటున్నారు, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న కుటుంబాలు కూడా, తమ ఇంట్లో వంట సామాగ్రి లేకపోయినా, మందుబాబులు అప్పు చేసి మరి, చుక్కేస్తున్నారు అంటే, మందుకు ఎంతవరకు బానిస అయ్యారో మనకు అర్థమవుతుంది, పెన్షన్ దారులు కూడా, ఈ బెల్ట్ షాపుల వద్దకు వెళ్లి, మాకు పింఛన్ రాగానే ఇస్తామని చెప్పి, ఉద్యరమందు సేవిస్తున్నారు, ఇదే అదనుగా చేసుకున్న బెల్ట్ షాపుల యజమాన్యం ఒక క్వార్టర్ కు, 30, నుండి40, రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు,



మొన్నటికి మొన్న నూతనంగా ఎన్నికైనటువంటి గ్రామపంచాయతీ సర్పంచి, గ్రామాలలో ఉన్నటువంటి బెల్ట్ షాప్ ల గురించి, ఆప్కారి సిఐతో,చరవాణిలో మాట్లాడితే, ఆయన దానికి సమాధానంగా, బెల్ట్ షాపులు బంద్ చేస్తే, ప్రభుత్వం ఎట్లా నడుస్తుంది అని చెప్పడంతో, అది అప్పుడు వైరల్ గా మారిన, గ్రామాలలో నడుస్తున్నటువంటి బెల్ట్ షాపుల యజమానులకు, ఆప్కారి శాఖ అధికారులు, గ్రామాలలో ఉన్నటువంటి బెల్ట్ షాపులకు అండగా ఉన్నారన్న విషయం అర్థమవుతుంది, ఈ బెల్ట్ షాపుల వల్ల గ్రామాలలో ప్రతిరోజు ఏదో ఒక ఇంట్లో గొడవలు జరిగి కుటుంబాలు విడిపోతున్నాయి, వీటి వల్ల అక్రమ సంబంధాలు పెట్టుకున్న మందుబాబులు, హత్యలకు గురవుతున్నారు, ఇంత జరిగినా ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తూ, మరోపక్క సంబంధిత శాఖ అధికారులు లంచాలకు మామూల్లకు అలవాటు పడి, ఈ యొక్క బెల్ట్ షాపులను పట్టించుకోకపోవడంతో, ఆయా గ్రామాలలోని మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు, వెంటనే గ్రామాలలో బెల్ట్ షాపులు నిరోధించాలని, ఇది ఇలాగే కొనసాగితే, మహిళాలోకం ముందుకొచ్చి, మా సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపిస్తామని, వారు హెచ్చరిస్తున్నారు.....


# మర్పల్లి విద్యాధికారి తాను చదివిన పాఠశాల ను సందర్శించి విద్యార్థులకు స్వీట్లు పంచారు




**వికారాబాద్ నియోజకవర్గ ఫిబ్రవరి 27(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలంలో ఎం ఈ ఓ గా ఛార్జ్ తీసుకున్నటువంటి బి. అశోక్ మండలంలోనూ తన ఫస్ట్ విసిటింగ్ ను తాను చిన్నప్పుడు చదువుకున్నటువంటి ప్రాథమిక పాఠశాల సిరిపురం నుంచి ప్రారంభించడం జరిగింది ,ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల బృందం ఎం ఈ ఓ గారికి ఘన స్వాగతం పలికి, శాలువతో చిరు సత్కారం చేయడం జరిగింది , తను చదువుకున్నటువంటి పాఠశాలకు విజిట్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎంఈఓ గా చార్జ్ తీసుకున్న సంతోషకరమైన సమయంలో ఎంఈఓ తనే స్వయంగా స్వీట్స్ తీసుకువచ్చి విద్యార్థులకు అందించడం జరిగింది . ఈ సందర్భంగా ఎం ఈ ఓ అకాడమిక్ సంబంధించిన సలహాలు ఎల్ ఎఫ్ ఎన్ మరియు ఎఫ్ ఎల్ ఎస్ కు సంబంధించి, రికార్డ్ మెయింటెనెన్స్ గురించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ విద్యార్థుల జ్ఞాన అభివృద్ధికై కృషి చేయాలని సూచించడం జరిగింది

# ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, ఫిబ్రవరి 27, (ప్రజాబలం ప్రతినిధి)** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు.వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



# పంచలింగాల్ లో ఉల్లిగడ్డ అంటేనే నెంబర్ వన్, అడుగంటిన ధరలు ఆగమై పోతున్న కౌలురైతులు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచల్ లింగాల్ గ్రామంలో ఉల్లిగడ్డ అంటే నెంబర్ వన్ విలేజ్ కానీ ఈనాడు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టి నాట్లు వేసి నీళ్లు పెట్టి న రైతన్న గిట్టుబాటు ధర లేక ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో రైతు విలపిస్తూ ఆవేదన వ్యక్తపరుస్తున్నట్టు కవ్ల రైతు మేతరి దేవదానం తండ్రి బాలయ్య తెలిపారు ,భారతదేశం అంటేనే సంపన్న దేశం భారతదేశం అంటేనేభాగ్యసీమ అంటారు కానీ ఈనాడు తెలంగాణలో ఉల్లి గడ్డ వేసిన రైతులు లగోడి పైసలు ఎలక చాలీ చాలని పరిస్థితుల్లో కుటుంబాలు ఎల్లతీస్తున్నామని ఆవేదన వ్యక్తపరిచారు రైతు బంగారం కొనడానికి వెళ్తే ఆకాశమంత ఎత్తు అవధులు లేని రేటు ఉంటుంది కానీ రైతు పండించిన పంటకి నికాసన రేటు లేదు పండించిన పంటకు విలువేలేదు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ అధికారులు రైతు పక్షాన మాట్లాడి గిట్టుబాటు ధరలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఉల్లిగడ్డ రైతులు ఆవేదన వ్యక్తపరిచారు

# మాదిగ హక్కుల దండోరా (ఎం హెచ్ డి) ఆరవ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ

## .హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి దొడ్డే రాజేంద్రప్రసాద్.

**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 27** జమ్మికుంట పట్టణం ఆబాదిలో మాదిగ హక్కుల దండోరా ఆరవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎం హెచ్ డి నాయకులు హుజరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి దొడ్డే రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి, మాదిగల ఉద్యమ పతాకాన్ని ఎగురవేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజిక హక్కుల సాధన కోసం ,దండోరా ఉద్యమం నిరంతరం పోరాట పతం పోరాటపదంలో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన విషయంలో స్పష్టమైన పోరాటం చేసి వాటిని సాధించుకోవడం జరిగిందని మాదిగల హక్కులకు ఎక్కడ నష్టం జరిగిన వివిధ రకాల పద్ధతులలో మాదిగ హక్కుల దండోరా తన గళాన్ని గట్టిగా వినిపిస్తూ వస్తుందన్నారు మాదిగల సంక్షేమం సామాజిక న్యాయం సమాన అవకాశాలు సాధన వంటి అంశాలపై ఉద్యమం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు రాజ్యాంగ బద్ధ హక్కుల పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు మాదిగ హక్కుల దండోరా 6వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహభరితంగా, ఉద్యమ స్ఫూర్తితో జరిగాయి.ఈ సందర్భంగా నాయకులు ఉద్యమ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మరింత విస్తృతంగా నిర్వహిస్తూ హక్కుల సాధన దిశగా పోరాటాన్ని బలోపేతం చేస్తామని నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డే రాజేంద్రప్రసాద్ తెలిపారు .ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి దొడ్డే రాజేంద్రప్రసాద్, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు దొడ్డే శ్రీకాంత్, దొడ్డే రాజు, దొడ్డే దిలీప్, దొడ్డే అరుణ్ కుమార్, శనిగరపు అజయ్ కుమార్, అభిరామ్, వీరెల్లి శ్రీమాన్ ,నరేష్, వీరల్లి సమ్మయ్య, కోలా రాజు తదితరులు పాల్గొన్నారు



# ఐఎన్టీఎస్ఓలో శ్రీ కాకతీయ విద్యార్థుల ప్రభంజనం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 27**హుజురాబాద్ పట్టణంలోని శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు ఐఎన్టీఎస్ఓ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చారు. శ్రీ చైతన్య కరిక్యులం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పాఠశాల విద్యార్థులు అనేక విభాగాల్లో బహుమతులు సాధించి ప్రభంజనం సృష్టించారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని పిట్ట రిషేంద్ర చౌహన్ గెలుచుకోగా, రెండో బహుమతులను కె. తరుణిక, బింగి అక్షర సాధించారు. మూడో బహుమతులను మాట్లా అయాన్స్, రిషిక్ రెడ్డి, భరత సాత్విక అందుకున్నారు. నాలుగో బహుమతులను విజువల్, వర్షకేశ్వరావు, సహర్ష్ రెడ్డి, దాసరి చరణ్య, పి. తేజస్విని సాధించారు. అదనంగా 54 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, 12 మంది స్పెషల్ ప్రైజులు, 93 మంది గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లా సందీప్ కుమార్ మాట్లాడుతూ, తమ విద్యార్థులు విద్యలోనే కాకుండా పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాడు శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం మధుసూదన్ రెడ్డి, కోఆర్డినేటర్లు రాంబాబు, విజయలక్ష్మి, డీన్ శ్రీనివాస్, ప్రైమరీ ఇన్చార్జ్ రజితతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ఈ విజయం పాఠశాలకు మరింత గౌరవం తీసుకువచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# భారీ అంచనాలతో వారణాసి

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కలయికలో రాబోతున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి'. ఆర్ఆర్ఆర్ వంటి గ్లోబల్ హిట్ తర్వాత రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇందులో హీరోయిన్ గా నటిస్తోన్న ప్రియాంక చోప్రా.. తన 'బ్లఫ్' మూవీ ప్రమోషన్స్లో ఈ చిత్రం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా షూటింగ్ అప్డేట్ ఇవ్వడంతో పాటుగా, మూవీ కాన్సెప్ట్ ఏంటనేది రివీల్ చేశారు., వారణాసి అత్యంత ప్రతిష్టాత్మకమైన బిగ్గెస్ట్ సినిమా అని అన్నారు. ఈ క్రమంలో సినిమా కాన్సెప్ట్ ఏంటనేది రివీల్ చేశారు. "సినిమాలో టైమ్ ట్రావెల్ చేస్తాం, ప్రపంచమంతా తిరుగుతాం.. ఒక అడ్వెంచరస్ జర్నీ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని ప్రియాంక తెలిపారు ఈ సినిమాకు సంబంధించి 14 నెలల పాటు చిత్రీకరణ జరిగిందని, ఇంకా 6 నెలల షూటింగ్ మిగిలి ఉందని ఆమె తెలిపారు. రాజమౌళి ఈ సినిమాకి కొంచెం టైమ్ తీసుకుంటున్నారని, ఆల్రెడీ షూట్ చేసిన దాంట్లో కొంతభాగం చూసే అవకాశం తనకి దక్కిందని, సినిమా చాలా బాగా వస్తోందని, ఇండియన్ సినిమా అంటే ఏంటో వారణాసి తెలియజేస్తుందని ప్రియాంక చెప్పుకొచ్చారు.

# పీఎంశ్రీ కార్యక్రమాల అమలు పరిశీలన

## పలు విద్యాలయాల్లో పరిశీలించిన పీఎంశ్రీ నోడల్ అధికారి, ప్రవీర్ కుమార్








**రాజన్న సిరిసిల్ల/తంగళ్ళపల్లి, ఫిబ్రవరి -27 (ప్రజాబలం ప్రతినిధి)**పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలను సందర్శించారు. మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయంలో పీఎంశ్రీ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఆయా పాఠశాలలో పూల మొక్కను నాటారు. పీఎంశ్రీ కింద జిల్లాలోని ఆయా స్కూల్ లలో చేపట్టిన పనులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులను పాఠ్యాంశాలతో పాటుగా అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపేట తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలను అభినందించారు. అన్ని విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పీఎంశ్రీ అమలు పై సమీక్షించారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, పాఠశాల విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్ రావు, సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్ విక్రమ్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ దబ్బెడ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలువగా, పుష్ప గుచ్చం అందజేశారు

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నీల నాగరాజు ఎన్నిక



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 27** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా వీణ వంక మండల కేంద్రానికి చెందిన నీల నాగరాజు ని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ నియమించారు. ఈ సందర్భంగా నీల నాగరాజు మాట్లాడుతూ. రాష్ట్ర పరిధిలోగల అన్ని జిల్లా లో మండలాలలో వారం రోజుల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల యొక్క హామీలు అమలు జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని వారు అన్నారు. నాయొక్క నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ కి తెలంగాణ ఉద్యమకారుల అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు.

## ప్రారంభించిన ఖమ్మం పీఠ కాపరి డాక్టర్ శ్రీశ్రీ సగిలి ప్రకాష్ బిషప్ వాక్య పరిచర్యలు అందించిన ప్రఖ్యాత ఏసుక్రీస్తు సువార్త బోధకులు డివైన్ మెర్సి మంగళగిరి విసి ఫాదర్ జై సన్

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజాబలం)** ఏదులాపురం మున్సిపాలిటీ కరుణగిరి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రార్థనలను ఖమ్మం పీఠ కాపరి బిషప్ డాక్టర్ తగిలి ప్రకాష్ గారు ప్రారంభించి ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొని







దేవుని కృపలో అందుకోవాలని ఆహ్వానించి అందరికీ ఆశీర్వాదాలు అందజేసినారు తదుపరి మంగళగిరి డివైన్ మెరిసి విసి ఫాదర్ జై సన్ వాక్య పరిచర్యను అందజేస్తూ వారి టీం బోధకులైన సిస్టర్ పునీత పౌస్టీన ద్వారా బయలుపరిచిన విషయాలు తెలియపరిచినారు అవి కరుణ కోసం ఆ దేవుని వైపు చూచి ప్రార్థించగా అంధుడైనభక్తిమఇ స్వస్థత పొందినాడని తెలియపరిచినారు ప్రార్థన జీవితము లేని వారు ఈ ఆపత్కాలంలో కరుణ కోసమో ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని వారిలో ఉన్న మరియు వారిలో ఉన్న పాపపు ముద్ర తొలిగి పరలోకమునకు చెందిన ముద్ర కోసం జారించాలని నిన్ను నన్ను బతికించేది ఆ యొక్క దేవుని యొక్క కృప మాత్రమే పర్వత్ పర్వతములు గతించిన తుప్పలు చెల్లించిన గాక కానీ అని దేవుని ప్రేమ నిన్ను శాశ్వతమైన హస్తముగా ఆదరించును అని తెలియపరిచినారు కనుక మనమందరము ధ్యానించాలి అందరిని కోరినారు ఈ కార్యక్రమంలో కరణగిరి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జానీస్, ఫాదర్ విన్సెంట్, ఫాదర్ కొమ్ము ఆంథోనీ ఫాదర్ ఎలియాస్ ఫాదర్ యాంజిలో గారు ఫాదర్ అంతోని తదితరులు ఈ యొక్క వాక్య పరిచర్య కార్యక్రమ ప్రారంభంలో పాల్గొన్నారు సాయంత్రము భద్రాచలం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ విన్సెంట్ దివ్య బలి పూజను సమర్పించినారు అనంతరం వివిధ విచారణ ప్రాంతాల నుండి వచ్చిన వారికి గ్రూప్ డాన్స్ పోటీలు ఫాదర్ పౌల్ రాజ్ ఎం ప్రసాద్ ఎం.బాబురావు లు నిర్వహించడం జరిగింది

# అనారోగ్యంతో పోరాడుతున్న సభ్యునికి టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) అండ

## ఆర్థిక సహాయం అందించిన నాయకత్వం



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజాబలం)**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్?2843) ఖమ్మం జిల్లా కమిటీ తమ సభ్యుని సంక్షేమం విషయంలో మానవత్వాన్ని చాటుకుంది. తీవ్ర అనారోగ్యంతో ఖమ్మం నగరంలోని కార్తీక్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మర్కారపు (బస్టాండ్) రమేష్‌ను జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్ ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు. సభ్యుల కష్టసుఖాల్లో తోడుగా నిలవడం తమ కర్తవ్యమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు వైద్యుల నుంచి రమేష్ ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలుసుకున్న నాయకులు, మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. అవసరమైన పరీక్షలు, చికిత్సలు సమగ్రంగా చేపట్టి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమమే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ - 2843) ధ్యేయమని, అత్యవసర సమయంలో సంఘం అండగా ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ, ఈసీ సభ్యులు ఓరుగంటి కిరణ్, లింగాల రామ్మూర్తి, కొణతాలపల్లి నాగేశ్వర రావు, టీబీజేఎ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, పట్టణ కార్యదర్శి కప్పల మధు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఐక్యతను చాటుకున్నారు



# ఐక్యతకు ప్రతీకగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**ప్రజాబలం దినపత్రిక వేములవాడ ఫిబ్రవరి -27** వేములవాడ పట్టణ ముస్లిం సోదరులందరికీ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విద్యానగర్‌లోని మోయిన్ మసీదులో శుక్రవారం రోజున కాంగ్రెస్ నాయకురాలు సరిపెల్లి అర్చన-నరేష్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులు పరమత సహనానికి, స్నేహసంబంధాల బలోపేతానికి దోహదపడతాయని అర్చన పేర్కొన్నారు. మార్చి 21న జరగనున్న రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, మౌలాలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 50 వేల రూపాయలు విరాళం ఇచ్చిన కల్లూరు రామచంద్రారెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం ప్రజాబలం ఫిబ్రవరి 27 కొలనుపాక గ్రామం నుండి బైరంనగర్ వెళ్లే దారిలో పెద్దవాగు పైన వంతెన నిర్మాణం చేపట్టారు ఈ నిర్మాణానికి ఖర్చులకు గాను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరు రామచంద్రారెడ్డి తన వంతు సహాయంగా 50 వేల రూపాయలు బైరం నగర్ చెందిన నంద మహేందర్ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ వెంకటేష్ లకు కొలనుపాక మాజీ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మి ప్రసన్న రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది ఈ కార్యక్రమంలోబి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ కొనుపాక బి ఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జంగస్వామి పి ఏ సి ఎస్ డైరెక్టర్ ఆరే మల్లేష్ బి ఆర్ ఎస్ కొలనుపాక వార్డ్ మెంబర్ బల్లెపు సంపత్ కుమార్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి శంకర్ బొంకురి రాములు గంధమల రవి ఏదునూరి భాస్కర్ భైరవ్ నగర్ వాసులు నంద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సబ్ రిజిస్ట్రార్ కు ఘనంగా సన్మానం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 27** శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని ఏక్ మినార్ మస్జిద్ లో హుజూరాబాద్ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ హుజురాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఇంతియాజ్ కు రంజాన్ మాసం సందర్భంగా నమాజ్ కొరకు మొదటి సారి ఏక్ మినార్ మజీద్ కి విచ్చేసినందుకు ఏక్ మినార్ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు .ఈ సన్మాన కార్యక్రమంలో జామే మస్జిద్ ఈద్గా ఓ ఖబ్రస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్,ఏక్ మినార్ మజీద్ అధ్యక్షులు మహమ్మద్ జలాలోద్దీన్ అక్బర్,17వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఖాలీక్,నవాబ్ ఖాన్,దులేపాషా, మతగురువును షేక్ నయీం, ముజామిల్,రహీం,ఖాజా,ఖాజాపాష,చాంద్,అజ్జు,జలీల్,నూర్,తాజ్, మున్వర్ ఖాన్,ఆబిద్,మత గురువులు తదితరులు మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలివిద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:**పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు. శుక్రవారం లక్ష్మణచందా మండలంలోని వద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు.కలెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. గణితం, ఇంగ్లీషు తదితర ముఖ్య విషయాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి, వారి సమాధానాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శ్రేణి మార్కులు సాధించాలని సూచించారు.అనంతరం పాఠశాలలో ఉన్న వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకుల సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందించాలి: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి** బ్యాంకుల సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, 2025- 2026 సంవత్సరపు త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు అన్ని బ్యాంకుల ద్వారా 8409.62 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయబడ్డాయని తెలిపారు. 64.56 లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు. బ్యాంకులు ప్రజల ఉన్నతికి మరింత తోడ్పాటును అందించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలు, సబ్సిడీ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. బ్యాంకులు అందించే పథకాల ద్వారా ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఆర్బీఐ ఎజిఎం రాములు, నాబార్డు డిడిఎం వీరభద్రుడు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజంజిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

### శిక్షణ పూర్తి చేసుకున్న 'కృషి సఖి'లకు ధృవీకరణ పత్రాల పంపిణీ




**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి** ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఔ-ఔఓఈ) కింద ఎంపిక చేసిన ఐకేపీ మహిళలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రసాయనాలతో కూడిన సాగు కంటే, శాశ్వత ప్రాతిపదికన సేంద్రియ పద్ధతులు పాటించడం వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని తెలిపారు. ఆర్గానిక్ పంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా అండగా నిలుస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేసేందుకు 15 క్లస్టర్లను ఎంపిక చేశామని, ప్రతి క్లస్టర్ నుండి ఇద్దరు ఐకేపీ మహిళలను 'కృషి సఖి'లుగా ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.శిక్షణ పొందిన మహిళలు గ్రామాల్లోని రైతులకు సేంద్రియ సాగు విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. అలాగే, జిల్లా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు వీలుగా ఒక ప్రత్యేక షాపును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను సంస్థ ప్రతినిధులు కలెక్టర్ కు అందజేశారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 'కృషి సఖి' మహిళలకు కలెక్టర్ ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, అరణ్య సంస్థ ప్రతినిధులు పద్మ, నర్సయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ బాధ్యతలుస్వీకరించిన అనురాగ్ జయంతి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి భువనగిరి నూతన మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి వాణి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసినారు



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ఫిబ్రవరి 27** నూతనంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా అనురాగ్ జయంతి బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా బోనగిరి ఎంపీ చామల భువనగిరి నూతన మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలసి శు భాకాంక్షలు తెలియజేసినారు

## పుస్తక పఠనంతోనే జ్ఞాన సముపార్జన:జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే అత్యుత్తమ సాధనమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరంతర పఠనం ద్వారా అపారమైన జ్ఞానంతో పాటు నైపుణ్యాలు మెరుగుపడతాయని, తద్వారా యువత మెరుగైన ఉద్యోగ అవకాశాలను దక్కించుకోవచ్చని ఆకాంక్షించారు. విద్యార్థులలో చిన్నతనం నుంచే పఠనాసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లాలోని పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను గుర్తించి పలు గ్రామాల నుంచి వినతులు అందుతున్నాయని, ఇది శుభపరిణామమని అన్నారు. ఆధునిక సాంకేతికతను జోడిస్తూ, కంప్యూటర్లు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో 'డిజిటల్ లైబ్రరీల'ను సైతం ప్రవేశపెడుతున్నామని, విద్యార్థులు ఈ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే స్వయంగా పుస్తకాలు రాసి ప్రచురించడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.టి తెలుగు ప్రచురణ విభాగం సహాయ సంపాదకులు డా. పత్తిపాక మోహన్, తెలంగాణ సారస్వత పరిషత్ సభ్యుడు సామల రాజవర్ధన్, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు సుమన్సతి రెడ్డి పాల్గొని పఠన విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ అధికారి రామేశ్వర్, ప్రముఖ కవులు డా. ఉదారి నారాయణ, డా. కందేపి రాణి ప్రసాద్, పోరెడ్డి అశోక్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోలా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల 18వ వార్డులో నీటి లీకేజీల నివారణ: కౌన్సిలర్ పర్యవేక్షణ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఫిబ్రవరి 27( ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు కౌన్సిలర్ మెరుగు మంజుల-శ్రీనివాస్ తాగునీటి సరఫరాను మెరుగుపరిచే దిశగా ముమ్మరంగా మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయి. వాగు నుండి వార్డులోని వివిధ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలను గుర్తించి, వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. క్షేత్రస్థాయి వార్డులను కౌన్సిలర్ స్వయంగా మరమ్మత్తులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి, పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా తన వార్డులో లీకేజ్ అయిన గేట్ వాలను వాటిని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేపించారు.

## చార్మినా ఎక్స, ప్రెస్ రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** కంది మండలంలో చార్మినార్ ఎక్స్ ప్రెస్ చీఫ్ బ్యూరో షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో, కంది పంచాయతీ సెక్రెటరీ కవిత, మరియు కంది గ్రామ ఉపసర్పంచ్ అసద్ ఖాన్, చేతుల మీదగా చార్మినార్ ఎక్స్ ప్రెస్ క్యాలెండర్ మరియు ఈ వి 9 న్యూస్ డైరీ ఆవిష్కరించడం జరిగింది,ఈ సందర్భంగా కవిత, మాట్లాడుతూ,చార్మినార్ ఎక్స్ ప్రెస్ పేపర్ నిర్భయంగా ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాస్తుందని, వారికి ధన్యవాదాలు తెలియజేసారు,అలాగే కంది గ్రామ ఉప సర్పంచ్ అసద్, మాట్లాడుతూ, ప్రజలందరూ సోదర భావంతో కలిసి మెలసి ఉండాలని,కంది గ్రామ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో ఈ వి 9 రిపోర్టర్ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

## వికారాబాద్ లో డీసీసీ అధ్యక్షుల సమావేశంలో చక్రాను తిప్పి నూలు వాడికిన బిర్లా ఐలయ్య



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ఫిబ్రవరి 27** స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమంలో భాగంగా దేశీయ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రత్నం చక్రాన్ని వాడికిన స్ఫూర్తిని నేటి తరానికి చేరవేలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు కొనసాగిస్తుంది ఏ నేపథ్యంలో వికారాబాద్ లో కొనసాగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల సమావేశం ఏడో రోజుకు చేరుకుంది శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా సహచర డిసిసి అధ్యక్షులు తో కలసి యాదాద్రి భువనగిరి జిల్లా బీసీసీ అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చక్రాను తిప్పి పత్తి నుండి దారం తయారు చేస్తూ స్వదేశీ భావాన్ని ప్రతిపాదించారు అదేవిధంగా స్వచ్ఛందంగా కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను చీపురు పట్టి ఊడ్చి శుభ్రం చేశారు మన పనులు మనమే చేసుకోవాలి అనే సందేశంతో భోజన అనంతరం చిన్న ప్లేట్లను స్వయంగా కడిగి ఆదర్శంగా నిలిచినాడు నేతన్నల పైన అభిమానాన్ని ఈ చర్యల ద్వారా బీర్ల ఐలయ్య చాటుకున్నారు నియోజకవర్గంలోని నేతన్నల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో కృషి చేస్తున్నట్లు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో ఆయా ప్రాంతాలలో ప్రజలు కూడా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com